ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 26.0



వారెక్కడ ?

ఎన్నికల వేళ.. సామాజిక వర్గాల వారీగా లెక్కలు

- అయిన వారికి కానుకలు, కాని వారికి అడ్డంకులు.. గ్రామాల్లో రకరకాల విన్యాసాలు
- అర్ధరాత్రి వరకు విందులు.. మంత్రాంగాలు

(ఏలూరు ఆంధ్రజ్యోతి, ప్రతినిధి):

గడిచిన ఐదేళ్ళలో వివిధ సామాజికవర్గాల్లో వచ్చిన మార్పులు, చేర్పులపై ఎవరు తమకు అనుకూలంగా వున్నారు ? ఎవరు వ్యతిరేకంగా వున్నారనే అంశాలపై టీడీపీ, నుంచి వైసీపీ వరకు లెక్క కడుతూనే వస్తున్నారు. గత ఎన్నికల్లో బలమైన సామాజిక వర్గాల ఓటర్లంతా ఏకపక్షంగా వైసీపీ వైపే మొగ్గు చూపాయి. అప్పట్లో టీడీపీ మీద వున్న వ్యతిరేకత కాస్తా వారందరిని ఆ దిశగా నడిపింది. రానురాను ఐదేళ్లలో ప్రజావ్యతిరేక చర్యలు, దాడులు, కేసులు, పోలీసుల ఒత్తిళ్లు, నాయకుల బెదిరింపులతో విసిగిన వివిధ సామాజిక వర్గాల నేతలు, వారి వెంట ఓటర్లు ఈసారి కొత్త అడుగులు వేయడానికి సిద్ధపడుతున్నారు. దీంతో అధికార వైసీపీ అప్రమత్తమైంది. ఏదో రూపంలో వీరిని అడ్డుకునేందుకు వ్యూహాలకు దిగుతోంది. పైకి ఏ మాత్రం పొగరాకుండా జాగ్రత్త పడుతున్నారు. తమ కోటరీ పరిధిలోని సామాజికవర్గ నేతలను ముందుగా ప్రయోగించి అనుకూలమా, వ్యతిరేకమా అనేది అంచనాకు వస్తున్నారు. దీన్ని కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పక్షాలు గమనించాయి.

> ఏ నియోజకవర్గంలో ఏ సామాజిక వర్గానికి చెందిన వారు ఎంత సంఖ్యలో ఉన్నారు. ప్రస్తుతానికి వారి రూటు ఎటు ? మన దారికి తెచ్చుకోవడం ఎలా.. ఏం కావాలంటే అది ఇద్దాం. వాళ్ళంతా బయటపడక్కర్లేదు. అంతర్గతంగా మనకు ఓటేస్తే చాలు. దేనికైనా మేము రెడీ. కాని ఎప్పటికప్పుడు ఓ కన్నేసి ఉంచండి. ఎవరెవరు ఎటు ఎటు వెళుతున్నారో చూడండి. వెంటనే మా చెవిన వేయండి. ఆ తర్వాత సంగతి మేం చూసుకుంటాం. సామాజిక వర్గాల ఓటర్లను తమ దారికి తెచ్చుకునేందుకు ఏలూరు జిల్లాలోప్రధాన పక్షాల నేతలంతా వేస్తున్న ఎత్తులు ఇవి.

ఏలూరు, దెందులూరులో..

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మూడింతుల ఓటర్లు నగరంలోనే ఉన్నారు. వీరిలో వివిధ సామాజిక వర్గాలతోపాటు ఉద్యోగుల సంఖ్య ఎక్కువే. సామాజికవర్గ కోణంలోనే ఇప్పుడు లెక్కింపు ప్రారంభమైంది. కాపు, బీసీ, దళిత సామాజిక వర్గాలకు చెందిన ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉంది. ఏలూరు రూరల్ పరిధిలో కొల్లేరు వాసులు ఉన్నారు. వీటిని బేరీజు వేసుకుని తమదే పైచేయి సాధించేలా జాగ్రత్త పడుతున్నారు. టీడీపీ పక్షాన అత్యధికులు మొగ్గు చూపుతుండగా దీనికి భిన్నంగా వైసీపీ కొత్త ఎత్తుగడకు దిగుతోంది. ప్రశాంతత కావాలంటే తమకే ఓటు వేయాలంటూ కొన్నేళ్ళుగా జరిగిన కొన్ని ఘటనలపై ప్రచారానికి దిగింది. దెందులూరు నియోజకవర్గ పరిధిలో వైసీపీ, టీడీపీ మధ్య నువ్వా నేనా అనే యుద్ధం సాగుతోంది. వాదప్రతివాదనలు, దాడులు, సవాళ్ళు ఇక్కడ రోజూ చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ టార్గెట్‌గా వైసీపీ సోషల్ మీడియాలో బురదజల్లే ప్రయత్నం చేస్తోంది. దాడులకు సరికొత్తరంగులు పులుముతోంది. టీడీపీ అప్రమత్తమై గ్రామాల్లో సామాజిక వర్గాల వారీగా తమ పార్టీ అనుకూలతపై ఇప్పటికే ఓ లెక్క కట్టింది.

ఉంగుటూరులో నువ్వా నేనా..

ఉంగుటూరులో సామాజిక వర్గాల ప్రభావం అత్యధికం. జనసేన అభ్యర్థి ధర్మరాజుకు బలమెంత? అదనంగా చేకూరే బలమెంత? తమకు ఒనగూరే ప్రయోజనం ఏంటి..? అనేది వైసీపీ సామాజిక లెక్కలకు పదును పెట్టింది. కాని ఇక్కడవున్న బీసీలు, కాపులతోపాటు మిగతా సామాజికవర్గాల వారు మొదటి నుంచి తేలిపోకుండా ఆఖరికి తమ తీర్పు భిన్నంగా ఉండేలా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుబాబు, జనసేన బలపరిచిన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. టీడీపీలో బలమైన సామాజిక వర్గాలతోపాటు బీసీ వర్గాలు సమ్మిళితమైన నాయకత్వం ఉంది. ఈ వైపు నుంచే సంపూర్ణ మద్దతు తమకే ఉంటుందని, తమకు ఇక తిరుగులేదని, ఇప్పటికే జనసేన అభ్యర్థి ఒక నిర్ణయానికి వచ్చేశారు. తన గెలుపునకు ఢోకాలేదని భావిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు.

నూజివీడు, కైకలూరులో ఇంకో సీన్

నూజివీడులో వైసీపీ ప్రతాప్ అప్పారావుకు పోటీకి వీలుగా మరో అవకాశం ఇవ్వగా, టీడీపీ బీసీ అభ్యర్థి పార్థసారధిని రంగంలోకి దింపింది. ఇక్కడ బీసీ ఓటర్లు అత్యధికం. వీరే గెలుపు నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో గౌడ, యాదవతో సహా మిగతా బీసీ సామాజిక వర్గా లన్ని సారధికి అనుకూలంగా ముందుకు వెళుతుండగా, ఇంకోవైపు తనకు ఉన్న పరిధిలో వైసీపీ కూడా ఏ గ్రామానికి ఆ గ్రామాన బీసీ ఓటర్లు, తమవైపు మొగ్గు చూపేలా ఎత్తుగడలకు దిగుతోంది. వీలైతే కానుకలు, బహుమతులను విసరాలని భావిస్తోంది. నూజివీడు పరిధిలో సామాజికవర్గాల బలాబలాలు ఎవరి వైపు అనుకూలంగా ఉన్నా యో అనే దానిపై ఇరుపార్టీలు ఇప్పటికే లెక్కల తక్కెడ వేస్తు న్నాయి. కైకలూరులోనూ వడ్డీలు, గౌడ, కాపు, యాదవ సామా జిక వర్గీయులు ఈసారి ఏ వైపు తొంగిచూస్తున్నారనే దానిపై ఇప్పటికే టెన్షన్ నెలకొంది. ఈ వర్గాలు అన్ని తమకే మద్దతు ఇస్తున్నాయని కూటమి ఇప్పటికే ఒక అంచనాకు వచ్చింది. ఎస్సీ వర్గాలతోపాటు బీసీ వర్గాల్లో తమకు మద్దతుదారులు సంతృప్తి కరంగా ఉన్నారనే దానిపై వైసీపీ ఇంకోవైపు లెక్క కడుతోంది. కూటమి వైసీపీ మధ్య సామాజికవర్గాల వారీగా బేరీజు ఉత్కంఠ రేపుతోంది.



పోలవరం, చింతలపూడిలో ఇంకో తీరు

ఎస్సీ రిజర్వుడ్ చింతలపూడి, ఎస్టీ రిజర్వుడ్ పోలవరం నియోజకవర్గాల్లో ఏలూరు జిల్లాలోని ఓటర్ల సంఖ్య అత్యధికం. ఈ రెండుచోట్ల విభిన్న కోణాల్లోనే ఉన్నాయి. చింతలపూడిలో బీసీలతోపాటు కాపు, ఎస్సీ, రెడ్డి, సామాజిక వర్గానికి చెందిన వారే ప్రతిసారి అభ్యర్థుల గెలుపు, ఓటమిలను నిర్దేశిస్తున్నారు. ఈసారి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఒక్కటవ్వడంతో సామాజికవర్గాల్లో ఓటర్ల మద్దతులో మార్పులు, చేర్పులు వచ్చాయి. మండలాల వారీగానే కాకుండా చింతలపూడి, జంగారెడ్డిగూడెం నగర పంచాయతీల్లో ఉన్న ఓటర్లే గెలుపు నిర్ణేతలు కాబోతున్నారు. ఈ రెండు ప్రాంతాలపైనే అటువైపు కూటమి, ఇటువైపు వైసీపీ మోహరించి అనుకూలత, వ్యతిరేకత పైన సామాజిక వర్గాల మద్దతుపైనే ఓ అంచనాకు వచ్చేందుకు ముప్పుతిప్పలు పడుతున్నాయి. పోలవరంలోనూ ఇదే విధమైన కసరత్తు సాగుతోంది. ఇక్కడి ఏడు మండలాల్లోనూ బలాబలాలపై దృష్టి పెట్టారు. ఎస్టీ సామాజికవర్గంలో భిన్నతెగలు ఉండడం వీరంతా ఏకపక్షం కాకుండా పరస్పర భిన్నాభిప్రాయాలతో ఉన్నారు. గతంలో వైసీపీకి వరుసగా విజయాలు అందిస్తూ వచ్చిన వీరంతా ఈసారి కొత్త అడుగులు వేస్తున్నారంటూ కూటమి అంచనా వేస్తోంది. ముంపు మండలాలైన కుక్కలూరు, వేలేరుపాడులో నిర్వాసితులు అంతా ఓ సామాజిక వర్గంగా ఏర్పడి, తీసుకునే నిర్ణయం అత్యంత కీలకం కాబోతోంది. ఈ నిర్ణయం తమకు అనుకూలంగానే ఉండబోతోందని ఇప్పటికే కూటమి ఓ లెక్కకు వచ్చింది.



అధికార పార్టీకి ప్రచారం చేస్తున్న మున్సిపల్ ఉద్యోగి రత్నకుమార్

వైసీపీ ప్రచారంలో మున్సిపల్ ఉద్యోగులు..

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 28 : అధికార వైసీపీ విజయానికి మున్సిపల్ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించడం విమర్శలకు దారితీస్తోంది. నగర పాలక సంస్థలో వాటర్ ట్యాంక్ ఆపరేటర్లుగా పని చేస్తున్న వేమండ్ర రత్నకుమార్, రేమండ్ర రవికుమార్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార వైసీపీ తరపున ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారపుపేట ఇందిరా కాలనీలో ఆదివారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో వీరిద్దరు పాల్గొన్నారు.



అధికార పార్టీ నాయకుల ప్రచారంలో మున్సిపల్ ఉద్యోగి రవికుమార్

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

చాట్రాయి, ఏప్రిల్ 28 : మండలంలోని కృష్ణారావుపాలెం వద్ద ఉన్న తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టును ఆదివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు టి.శ్రీధర్ తనిఖీ చేశారు. నగదు, మద్యం మొదలైనవి అక్రమ రవాణా కాకుండా చెక్‌పోస్టులో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వాహనాల తనిఖీని పర్యవేక్షించారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి : కలెక్టర్


ఏలూరు సిటీ, ఏప్రిల్ 28 : ఎన్నికల నేపథ్యంలో నియోజక వర్గాల పరిధిలో ఏమైనా ఫిర్యాదులుంటే ఫోన్ ద్వారా లేదా అర్జీల రూపంలో ప్రజలు, రాజకీయ పార్టీలు సంబంధిత నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులకు తెలపవచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వీరు బస చేసే కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో ప్రతి రోజు ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 5గంటల తర్వాత ఫిర్యాదు చేయవచ్చన్నారు.

- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో, ఉంగుటూరు, ఏలూరు, దెందులూరు అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎన్నికల పరిశీలకుడిగా కృష్ణకాంత్ పాఠక్ వ్యవహరిస్తున్నారు. ఫోన్ నెంబర్ : 91546 90377.
- పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎస్‌ఏ రామన్ పరిశీలకుడి గా వ్యవహరిస్తున్నారు. ఫోన్ నెంబర్ : 94910 41437.
- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజక వర్గాలకు వ్యయ పరిశీలకుడు పి.కీర్తి నారాయణ్ వ్యవహరిస్తున్నారు. ఫోన్ నెంబర్ : 85006 67695.
- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి వ్యయ పరిశీలకునిగా షేరింగ్ జోర్డన్ భూటియా వ్యవహరిస్తున్నారు. ఫోన్ నెంబర్: 94910 72224.
- ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పోలవరం నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడిగా మేశ్రం గౌరవ్ మధుకర్ ఉన్నారు. ఫోన్ నెంబర్: 91542 43699.
- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి పోలీస్ పరిశీలకుడిగా పి.శ్రీధర్ వ్యవహరిస్తున్నారు. ఫోన్ నెంబర్: 91546 90388.

ఒకటి వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల స్వీకరణ

ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ గడువును మే 1వ తేదీ వరకు పొడిగించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఉద్యోగి ఏ జిల్లాలో, ఏ నియో జకవర్గంలో ఓటరుగా నమోదైనా తాను విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోని ఫెసిలిటేసన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఫారం-12 దరఖాస్తులను పూర్తి చేసి ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ , ఆధార్ కార్డు జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి సంబంధిత ఏఆర్‌వోకు అందజేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి మే 6 నుంచి మే 8వ తేదీ చివరి తేదీగా ఎన్నికల సంఘం ప్రకటించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఏ తేదీన, ఏ విభాగం అధికారులు , సిబ్బంది ఓటు వేయాలో శాఖాధిపతుల ద్వారా తెలియజేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లను కూడా ఈవీఎంలతో పాటు లెక్కిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బంది కొరత దృష్ట్యా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధుల్లోకి అంగన్‌వాడీలు, కాంటాక్ట్ ఉద్యోగులు ఒపీవోలుగా నియమించేందుకు ఈసీ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

రేపటి నుంచి లక్ష్మీపురం శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు

కాంతులీనుతున్న ఆలయ ప్రాంగణం.. గర్భాలయంలో కొలువైన శ్రీనివాసుడు

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 28 : ద్వారకా తిరుమల శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 30 నుంచి వచ్చేనెల 6 వరకు జరుగనున్న ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని పరిసరాలను రంగులతో, విద్యుద్దీప తోరణాలతో ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీనివాసుడిని పెండ్లికుమారునిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 3న రాత్రి 8గంటలకు ఉభయ దేవేరులతో స్వామి తిరుకల్యా ణోత్సవాన్ని ఆలయ ఆవరణలోని కల్యాణ వేదిక వద్ద నిర్వహిస్తారు. 4న సమీప గ్రామమైన తిమ్మాపురంలో గరుడోత్సవం జరుపనున్నట్టు ఈవో వేండ్ర త్రినాథరావు తెలి పారు. 5న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ రుగనున్నాయి. 6న రాత్రి జరుగ నున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పుష్పయాగోత్స వంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రజల కష్టాలు పట్టవా?

- ఇంటింటికి పింఛన్లు ఇవ్వాల్సిందే
- మా మేనిఫెస్టో సిక్సర్.. మీది డకౌట్
- గన్ని, సీతారామలక్ష్మి, చంటి విమర్శలు



విలేకరులతో మాట్లాడుతున్న గన్ని, చంటి, సీతారామలక్ష్మి

ఏలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'మే 1వ తేదీనే పేద ప్రజలు అందరికి ఇంటికి వెళ్ళి పింఛన్ ఇవ్వాల్సిందే. వలంటీర్లు బూత్‌లు చూపించి వదిలేయాలనుకుంటారా? ఆ నెపంతో మా మీద బురద చల్లుతారా? వేలమంది ఉద్యోగులతో ఈ పని ఎందు కు చేయించుకోలేరు. 'పేదలంటే మీకు అంత అలుసా'.. అంటూ టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉమ్మడి పశ్చిమ పరిశీలకురాలు సీతారామలక్ష్మి, ఏలూరు టీడీపీ అభ్యర్థి బడేటి చంటి వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం బడేటి చంటి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 'ఏ చిన్న సందు దొరికినా కూటమిపై ఎక్కుపెట్టేందుకు వైసీపీ చేస్తున్న వికృత చేష్టలను ప్రజలు గమనిస్తున్నారు. జగన్ ఇంటికి వెళ్ళేరోజు దగ్గరకు వచ్చింది. పింఛన్ ఎట్టి పరిస్థితుల్లో ఇంటింటికి వెళ్లి అందజేయాల్సిందే. ఈ విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా పరిశీలిస్తాం. అస్తవ్యస్త విధానాలతో వైసీపీ ఇప్పుడు ఓటమి అంచున ఉంది. దీన్ని తట్టుకోలేక కూటమిపై నిందలకు దిగుతోంది. పేదలపై ప్రేమ ఉంటే మేనిఫెస్టోలోనే అది బయటపడేది. అమ్మఒడి వర్తిస్తుందని ఎన్నికలకు ముందు ప్రకటించి ఆ తర్వాత అధికారంలోకి రాగానే ఇంట్లో ఒకరికేనంటూ ఆంక్షలు పెట్టింది మీరు కాదా..?. అధికార ఆత్రుతతో హామీలు గుప్పించడం ఆ తర్వాత గాలికి వదిలేయడం వైసీపీకి అలవాటే. తెలుగుదేశం పక్షాన సూపర్‌సిక్స్ పథకాలు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లాయి. అదే వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టో డకౌట్ అయింది. ఇప్పటివరకు మీట నొక్కి ప్రజలను మభ్యపెట్టి రోజులు గడిపేసిన వైసీపీకి బాధ్యత ఎక్కడ ఉంది. ఇవన్నీ తెలిసే సాధారణ జనం రోడ్లమీదకు వస్తున్నారు. తెలుగుదేశం ప్రచారంలోనూ వందలాది మంది స్వచ్ఛందంగా పాల్గొనడమే దీనికి నిదర్శనం' అంటూ వారు స్పష్టం చేశారు. సమావేశంలో చోడే వెంకటరత్నం, ఎంఆర్‌డీ బలరామ్, గూడవల్లి వాసు, కాశీనరేష్, రెడ్డినాగరాజు, దాన భాస్కర్ పాల్గొన్నారు.

రియల్‌గా.. కూల్చేశారు!



> గత ఐదేళ్లుగా భూక్రయ, విక్రయాలు బోల్తా పడ్డాయి. యజమానులు నిండా మునగ్గా కొనుగోలు దారులది అదే పరిస్థితి. రిజిస్ట్రేషన్ చార్జీలను ఎడాపెడా పెంచేశారు. మధ్యలో కరోనా వచ్చి లావాదేవీలు నిలిచిపోయాయి. గడిచిన రెండున్నర ఏళ్లలో నిర్దేశించిన ప్రాంతాల్లో 25 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచినా ఎవరూ కోలుకోలేదు. రిజిస్ట్రేషన్ శాఖ అనుకున్న ఆదాయ లక్ష్యాలు చేరినా భూవ్యవహారాలన్నీ బోల్తా కొట్టాయి. దీనికి అంతా వైసీపీ తీరే కారణం. స్పష్టత లేని నిర్ణయాలు, కేవలం కొందరికే కలిసొచ్చేలా మరికొన్ని నిర్ణయాలతో రియల్ రంగం అల్లకల్లోలంగా మారింది.

- ఎడాపెడా నిర్ణయాలతో భూములు ఫట్
- స్తంభించిన క్రయ విక్రయాలు
- వీధిన పడిన వందలాది మంది..
- త్రిశంకుస్వర్గంలో భూ యజమానులు
- ప్రధాన పట్టణాల్లోనూ వెంచర్లు ఆగమాగం
- ఇదంతా జగన్‌సర్కార్ చిత్రవిచిత్రాలే కారణం

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

రాష్ట్రంలోనే కాకుండా జిల్లా స్థాయిలోనూ 2009 నుంచి 2019 వరకు క్రయవిక్రయాలు అద్భుతంగా సాగాయి. భూమి ధర పెరగడంతో ఆ మేరకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు వెనుకాడేవారే కాదు. చిన్నాచితక అవసరాలకు భూములను తాకట్టు పెట్టి గట్టెక్కిన కుటుంబాలు ఎన్నో. ఏపీ విభజన తర్వాత తగ్గుతుంది అనుకున్న రియల్ ఎస్టేట్ జోరు తగ్గకపోగా కాస్తంత పెరిగింది. కాని వైసీపీ ఈ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ భూములే కాదు, విలువైన వాణిజ్య భూముల లావాదేవీలు ఆకస్మికంగా నిలిచి పోయాయి. ఈ ప్రభావం కాస్త అన్ని కుటుంబాల మీద పడింది. ఓ వైపు తెలంగాణలోని హైదరాబాద్‌లో భూముల ధరలు చుక్కలను అంటగా, అదేసమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భూముల ధరల్లో క్షీణత చోటు చేసుకుంది.

ఏలూరు చుట్టుపక్కల ఎకరా ఒక్కింటికి ఒకానొక దశలో మూడు నుంచి రూ.4కోట్లు ధర పలికింది. ఏలూరులో గజం ఒక్కింటికి చొప్పున భీమవరంలో సెంటు ఒక్కింటికి చొప్పున క్రయవిక్రయాలు సాగేవి. ఒకానొక దశలో భీమవరంలో సెంటు కోటి రూపాయల ధర పలికిన సందర్భాలు ఉన్నాయి. మెట్టప్రాంతమైన జంగారెడ్డిగూడెం వంటి పరిసరాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. పాలకొల్లు, తణుకు వంటి పట్టణాల్లో చెప్పనక్కర్లేదు. ఇదంతా 2020కి ముందు ఆ తర్వాత భూముల కొనుగోళ్లలో ప్రతిష్ఠంభన నెలకొంది. ఎందుకంటే కరోనా తర్వాత ఒక్కసారిగా నగదు లావాదేవీలు పెనుమార్పే జరిగింది. దీనికి తోడు ప్రభుత్వ నిర్ణయాలు, ఇంకోవైపు అధికార పార్టీ భూములపై దొంగ చూపులు. ఎక్కడ విలువైన భూములు కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలిపోవడం, ఏదో రూపంలో యజమానులను బెదిరించడం తక్కువ ధరకే సొంతం చేసుకునే ప్రయత్నాలు రాష్ట్రవ్యాప్తంగా వరుసగా చోటు చేసుకున్న దరిమిలా అసలు భూముల అమ్మకాలకు వెళ్లకుండా ఉంటే కనీసం భూమైనా భద్రతగా ఉంటుందని యజమానులు భావించారు. ఈ కారణంతోనే ఒకప్పుడు భారీగా సాగిన రియల్ వ్యాపారం కుప్పకూలింది.

ఆదాయం పెంచుకునే ఎత్తుగడ..

అయితే 2023 తర్వాత ఆదాయం పడిపోయిందని చెప్పి ఒక్కసారిగా రెట్టింపు చేసుకునేందుకు సర్కార్ ఎత్తుగడ వేసింది. దీంతో పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాలు ముఖ్య గ్రామాలు పరిసరాలు అన్నింటిలోనూ 25 శాతం మేర భూమి విలువలను పెంచేశారు. యజమానులు కొంత సంతోషపడినా ఆ తర్వాత భూమి కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఒక్కసారిగా కుదేలైయ్యారు. అయితే పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఇచ్చే సెంటున్నర స్థలం విలువ రూ.5 నుంచి రూ.8 లక్షలు ఉందంటూ జగన్ సర్కార్ అందర్ని బుట్టలో వేసింది. కేవలం ఒక పంటకే ఆధారమైన పంటచేలను జగనన్న కాలనీ నిమిత్తం లక్షలు ఖర్చు చేసి భూములు కొన్నారు. కేవలం ఇది కృత్రిమ ధర మాత్రమే. కమిషన్లు నొక్కేయడానికి మాత్రమే ఇది పనికొచ్చింది. ప్రధాన పట్టణాల్లో ఉన్న భూముల ధరలు సర్కార్ లెక్కల ప్రకారమే కోట్లు విలువ చేసినా కొనుగోలుకు నిరాసక్తత ఎదురవ్వడంతో అంతా బోల్తా కొట్టింది. ఉదాహరణకు ఏలూరు నగరంలో నడిబొడ్డున ఉన్న ఒక కీలక ప్రాంతంలో కేవలం 125 గజాల స్థలం రూ.2కోట్లు ధర పలికింది. కాని ఈ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ముందస్తుగా ఎవరూ ధైర్యం చేయలేదు. చివరికి ఆ స్థలాన్ని కోటి రూపాయలల్లోపే తెగ నమ్ముకోవాల్సి వచ్చింది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నమ్ముకుని వందలాది మంది నిరుద్యోగులు నిత్యం శ్రమించేవారు. ఎప్పుడైతే లావాదేవీలు స్తంభించాయో, రియల్ ఎస్టేట్ కుప్పకూలింది. దీంతో అంతోఇంతో సంపాదించుకునే నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. భీమవరం శివార్లలో కాస్త సంతృప్తిగా భూమి కలిగిన ఒక రైతు రెండున్నర ఏళ్ళ క్రితమే ఈ రియల్ ఎస్టేట్‌ను నమ్ముకుని వెంచర్ వేశారు. కాని మార్కెట్లో స్పందన రాలేదు. ఫలితంగా 50 శాతం కూడా అమ్మకాలు లేక నిలువునా తారెత్తిపోయారు. జంగారెడ్డిగూడెం పరిసరాల్లో రియల్‌వ్యాపారం అడ్డూఅదుపు లేకుండా సాగింది. ప్రైవేట్ ల్యాండ్స్ కొనుగోలుకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి రోజూ పెద్దసంఖ్యలో కొనుగోలు దారులు వచ్చిపోతా ఉండేవారు. ఎప్పుడైతే ఇక్కడి భూముల ధరలు పడిపోయానని సంకేతాలు వచ్చాయో ఆ వెనువెంటనే వచ్చిన వారంతా వెనుతిరిగారు. గడిచిన రెండున్నరేళ్ళ క్రితం వేసినా దాదాపు 180కి పైగా వెంచర్లు ఇప్పుడు లావాదేవీలు లేక కనిపిస్తున్నాయి. అధికారపార్టీలో ఉండి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కొంతమంది అధికారాన్ని ఉపయోగించుకుని చేద్దామని ప్రయత్నించినా వారికి కూడా పనికాలేదు.

అస్తవ్యస్త విధానాలే దెబ్బతీశాయి

రాష్ట్ర సర్కార్ ఒక క్రమపద్ధతిలో కీలక నిర్ణయాలు తీసుకోలేక తప్పటడుగు వేసింది. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జారీ చేసిన జీవో కూడా అందరిలో పెనుతుఫాన్‌సృష్టించింది. ఎవరైతే రిజిస్ట్రేషన్ చేయించుకుంటారో వారందరికీ ఒరిజినల్ కాపీ ఇవ్వబోమని, కేవలం జిరాక్స్ కాపీ మాత్రమే ఇస్తున్నట్టు జగన్ సర్కార్ జారీ చేసిన జీవో సారాంశం. ఈ జీవో రెండేళ్ల క్రితమే వెలుగు చూడడంతో భూ లావాదేవీలను తీవ్ర ప్రభావితం చేసింది. అటువైపు రిజిస్ట్రేషన్ శాఖలోనూ ప్రభుత్వం కట్టడి పెరిగింది. సాధ్యమైనంత మేర కీలక నిర్ణయాలు తీసుకునే రిజిస్ట్రార్‌లు ప్రస్తుత నిబంధనలతో నోరెత్తలేని పరిస్థితి. భూమి ధరలను నిర్దేశించే క్రమంలోనూ ఒత్తిళ్ళకు గురైయ్యారు. వైసీపీ నేతల నివాస ప్రాంతాల్లో భూముల ధరలను పెంచాలని ఒత్తిళ్ళు పెంచారు. ఇలా రకరకాలుగా అటు రిజిస్ట్రేషన్ శాఖపై ప్రభావితం చేసేలా ఉన్నాయి. ఇది కాస్త రియల్‌ను ధమాల్ చేశాయి. ప్రభుత్వం మారితేనే తప్ప భూముల విలువకు మళ్ళీ కాళ్ళు రావనే ఆశతో ఉన్నారు. కొందరైతే ఎన్నికల ప్రచారం మాదిరిగా భూముల సమస్యపైన ప్రచారం చేయడం గమనార్హం.

పవన్ రాక

- నేడు గణపవరం, రేపు కొయ్యలగూడెం
- కొయ్యలగూడేనికి నేడు షర్మిల రాక

- 7లో..



భాజా భజంత్రీలకు బ్రేక్..

- మే ఒకటి నుంచి మూడు నెలల పాటు మూఢమి
- ఆగస్టు నుంచి మరల శుభ ముహూర్తాలు

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 28 : ఈనెల 26 వరకు దాదాపు ప్రతీ రోజూ సందడి చేసిన పెళ్లిళ్లకు మూడు నెలలు బ్రేక్ పడ్డాయి. ఇందుకు కారణం వచ్చేనెల 1నుంచి మూఢమి ప్రవేశించడమే. సాధారణంగా చైత్ర, వైశాఖ మాసాల్లో అధికంగా పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ఈ ఏడాది ఈ మాసాల్లో శుక్ర, గురు మౌఢ్యమిలు ప్రవేశించడంతో శుభకార్యాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జూలై 7 వరకు శుక్రమౌఢ్యమి ఉండడం ఆ తర్వాత నుంచి ఆషాఢ మాసం ప్రవేశించడంతో ఆగస్టు 5 వరకు శుభకార్యాలకు బ్రేక్ పడింది. ఆ తర్వాత నుంచి పెళ్లిళ్లకు ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు గోవిందజుల రమణమూర్తి శర్మ తెలిపారు.

మౌఢ్యమి అంటే.. మన పురాణాల్లో గ్రహాలు, వాటి సంచారానికి అధిక ప్రాధాన్యతనిస్తారు. గ్రహాల స్థితి సరిగా లేకుంటే శుభకార్యాలు చేయరు. సైన్స్ ప్రకారం చూసుకున్న నవగ్రహాలు సూర్యుడి చుట్టూ తిరుగుతాయి. ఈ క్రమంలో భూమి, సూర్యుడు ఒక గ్రహానికి ఒకే వరుసలో ఉన్నప్పుడు ఆ గ్రహం భూమ్మీద ఉన్నవారికి కనపడదు, దీన్నే మూఢమి అంటారు. సూర్యునికి అత్యంత సమీపంలో ఏ గ్రహమైనా వస్తే ఆ గ్రహం తన శక్తిని కోల్పోతుంది. మూఢమి రెండు రకాలు. గురుగ్రహం సూర్యునికి దగ్గరగా వస్తే గురుమౌఢ్యం, శుక్రుడు సూర్యునికి దగ్గరగా వస్తే శుక్ర మౌఢ్యం. గ్రహాల స్థితి బలహీనంగా మారుతుంది. గురు, శుక్రలు శుభగ్రహాలు కాబట్టి సూర్యునికి అవి దగ్గరగా ఉన్నప్పుడు బలహీనమవుతాయి. ఆ సమయాన్ని మూఢమిగా పరిగణించి ఆయా రోజుల్లో శుభకార్యాలు చేయరు. శుభకార్యాలకు గురు, శుక్ర గ్రహాల బలమే ప్రధానం. అందుకే ఈ రెండు గ్రహాలు బలహీనంగా ఉన్నప్పుడు ఏమి చేసినా కలిసి రాదంటారు పండితులు. మూఢమిలో శుభకార్యాలు, లగ్నపత్రిక రాసుకోకూడదు, పెళ్లిమాటలు మాట్లాడుకోకూడదు. పుట్టు వెంట్రుకలు తీయరాదు. శంకుస్థాపనలు చేయరాదు. ఇల్లు మారకూడదు. అయితే అన్న ప్రాసనలు, ప్రయాణాలు, ఇంటి మరమ్మ తులు, భూముల లావాదేవీలు. నూతన ఉద్యోగాల్లో చేరొచ్చు, వాహనాల కొనుగోలు, కొత్తబట్టలు కొనొచ్చు.

నెరవేరని జగనన్న హామీలు

గోదావరిపై హేవలాక్ వంతెన పర్యాటకాభివృద్ధి హామీ అమలు చేయలేదు. కొవ్వూరులో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పట్టించుకోలేదు. కుమారదేవం, పైడిమెట్ట, బ్రాహ్మణగూడెం, చాగల్లు ఎత్తిపోతల పథకాల ఊసేలేదు. కొవ్వాడ కాలువపై తిరుగుడు మెట్టలో కల్వర్టు కల్వర్టు నిర్మాణానికి సుమారు రూ.50 కోట్ల పనులు ఎక్కడ?



జగన్మాయ

కొవ్వూరు హామీల వరద



కొవ్వూరు నియోజకవర్గంలో ఆదాయ వనరులు అంతంతమాత్రం కాగా పర్యాటకమే ప్రధానం. అభివృద్ధి చేయడానికి అవకాశాలున్నా వైసీపీ పాలనలో పర్యాటకం పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పాదయాత్రలో జగన్ హామీల వరద పారించారు. అధికారంలోకి వచ్చాక గోదావరిలో కొట్టుకుపోయాయి. ఒకపక్క ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన గోష్పాదక్షేత్రం, మరోపక్క గోదావరికి మణిహారాలుగా నిర్మించిన నాలుగు వంతెనలు. ఎక్స్‌ప్రెస్ హైవే ఆనుకుని, పచ్చని ప్రకృతి రమణీయ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమయ్యారు. రాజమహేంద్రవరం, కొవ్వూరును జంట నగరాలు చేస్తామని జగన్ ఇచ్చిన హామీ గోదారిలో కలిసిపోయింది. గోదావరిపై హేవలాక్ వంతెన పర్యాటక హామీని సీఎం జగన్ మరిచిపోయారు. కొవిడ్ ఉధృతంగా ఉన్నప్పుడు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల హాల్ట్ నిలిపివేశారు. నేటికీ వాటిని పునరుద్ధరించలేదు. నియోకవర్గ కేంద్రమైన కొవ్వూరు చుట్టుపక్కల సుమారు వంద గ్రామాలకు ముఖ్య పట్టణం. ఇక్కడ కనీసం డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కూడా చేపట్టకపోవడం వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. - కొవ్వూరు

కొవ్వూరు డివిజన్ కేంద్రం.. నియోజకవర్గ కేంద్రం.. మున్సిపాలిటీ.. సుమారు వంద గ్రామాలకు ముఖ్య పట్టణం.. వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. అభివృద్ధిని పట్టించుకోలేదు. 70 ఏళ్ల కిందట నియోజకవర్గ కేంద్రం ఎలా ఉందో నేటికి అలానే ఉంది. టీడీపీ ప్రభుత్వం హయాంలో పుష్కర సమయంలోనే చేపట్టిన అభివృద్ధి మాత్రమే ఇప్పటికీ కనిపిస్తుంది. కొవ్వూరు మున్సిపాల్టీ ఏర్పడి 5 దశాబ్దాలు అవుతున్నా డంపింగ్ యార్డు సమస్య వేధిస్తుంది. శాశ్వత డంపింగ్‌యార్డు లేకపోవడంతో ప్రతి రోజు ఇంటింటా సేకరించిన, చెత్తను రహదారుల వెంబడి పారబోసి తగల బెట్టడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి రిఫరల్ కేంద్రంగా పేరుగాంచింది. కొవ్వూరు పట్టణం నేషనల్ హైవేను ఆనుకుని ఉండడంతో ఆసుపత్రికి రహదారి ప్రమాదాలలో గాయపడిన వారిని ఇక్కడకు తీసుకువస్తుంటారు. అత్యవసర సేవలకు రాజమహేంద్రవరం రిఫర్ చేస్తున్నారు.

కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టక పోవడంతో జూనియర్ కళాశాలలో షిఫ్టుల వారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయి విద్య అందడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

జిల్లా ఆస్పత్రి ఏర్పాటు..

కొవ్వూరులో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో నిత్యం ఏదో ప్రమాదంలో క్షతగాత్రులు కొవ్వూరు ఆసుపత్రికి వస్తుంటారు. వారిని రాజమహేంద్రవరం, కాకినాడ రిఫర్ చేయడంతో రిఫరల్ కేంద్రంగా పేరుగాంచింది. రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి ప్రాంగణాన్ని మెడికల్ కళాశాలగా మార్చు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రి కొవ్వూరులో ఏర్పాటు చేస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది.



కొవ్వూరు, భద్రాచలం రైలు మార్గం పూర్తిచేయాలి

కొవ్వూరు, భద్రాచలం రైల్వేలైను సర్వే పనులను పూర్తిచేయాలి. నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. దీంతో ఏజెన్సీ ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుంది. తెలంగాణ నుంచి ఇతర ప్రాంతాలకు బొగ్గు రవాణాకు మార్గం సుగమమవుతుంది.

కొవ్వూరు పట్టణంలో స్థానిక క్రిస్టియన్‌పేట గామన్ వంతెన నుంచి గోదావరి గట్టు వెంబడి రోడ్డు కం రైలు బ్రిడ్జి వరకు నిర్మించిన గోదావరి బండ్ పార్క్ కళావిహీనంగా తయారైంది. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పార్క్ పిచ్చిమొక్కలు, విష పురుగులకు ఆవాసంగాను, జూద క్రీడలకు నిలయంగా మారింది. గోదావరి బండ్‌ను సుందరంగా తీర్చిదిద్దడంలో స్థానిక మంత్రి, వైసీపీ పాలకులు పూర్తిగా విఫలమయ్యారు.

కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో పంట కాలువలు, మురుగు కాలువలు దశాబ్దకాలంగా పూడిక తొలగించలేదు. కాలువలు పూడిక, గుర్రపుడెక్క, ఆక్రమణలతో వర్షాకాలంలో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగి రైతులు నష్టాల బారిన పడుతున్నారు.

నెరవేరని సీఎం హామీలు

- కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి రూ. 30 కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. రూపాయి విదల్చలేదు.
- కుమారదేవం, పైడిమెట్ట, బ్రాహ్మణగూడెం, చాగల్లు ఎత్తిపోతల పథకాలకు నూతన పంపులు ఏర్పాటుకు నిదులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికీ అతీగతీ లేదు.
- కొవ్వూరులో ఎస్సీ కమ్యూనిటీ హాలు, కాపు కళ్యాణ మండపం, ముస్లింలకు షాదిఖానా నిర్మాణానికి నిదులు కేటాయిస్తున్నట్లు, నియోజకవర్గంలో మూడు మండలాల్లో మూడు అంబేడ్కర్ భవనాలు నిర్మాణ ప్రతిపాదనలకు సీఎం రైట్ రైట్ అన్నారు. డబ్బులు ఇవ్వలేదు.
- కొవ్వాడ కాలువ వరద ముంపు నుంచి తాళ్లపూడి మండల రైతులను గట్టెంక్కించడానికి, ప్రమాదాలు జరగకుండా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో కల్వర్టు నిర్మాణం చేపడతామని, సుమారు రూ. 50 కోట్ల పనులకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ అందించారు. నిధులు ఇవ్వలేదు.
- గోదావరి తీరంలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం గోష్పాదక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టించుకోలేదు.
- కొవ్వూరు, రాజమహేంద్రవరం మధ్య రోడ్డు కం రైలు బ్రిడ్జిపై పెరిగిన వాహన రాకపోకల రద్దీని దృష్టిలో ఉంచుకుని రోడ్డు కం రైలు బ్రిడ్జికి అనుసంధానంగా మరో రోడ్డు వంతెన నిర్మాణం ప్రతిపాదనే లేదు.

కొవ్వూరులో రైళ్లు ఆగవు

కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్ట్ నిలిపివేశారు. హాల్ట్ పునరుద్ధరించడంలో ప్రభుత్వం, మంత్రి విఫలమయ్యారు. కొవ్వూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాలలోని సుమారు వంద గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిలుపుదల చేసిన రానుపోను 35 రైళ్లను పునరుద్ధరించాలని నేటికి ఆందోళన చేపడతూనే ఉన్నారు.

హామీల వంతెన హేవలాక్

గోదావరిపై మొట్టమొదటి వంతెన హేవ్‌లాక్ బ్రిడ్జి. రోడ్డు కం రైల్ బ్రిడ్జి నిర్మాణం అనంతరం హేవలాక్ వంతెనపై రాకపోకలు నిలిపివేశారు. నిరుపయోగంగా ఉన్న వంతెనను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రతిపక్ష హోదాలో పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే మరిచిపోయారు. మరమ్మతులకు గురైన రోడ్డు కం రైలు వంతెనకు పూర్తిస్థాయి పనులు చేపట్టక పోవడంతో తరచు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వంతెనల చెంతనే భారీ యంత్రాలతో ఇసుక డ్రెడ్జింగ్ చేయడంతో వంతెనలు క్రుంగిపోతున్నాయి. ఇటీవల గామన్ వంతెన స్తంభం కుంగింది. రాకపోకలు నిలిపివేశారు.



జంపింగ్ జపాంగ్..



ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అంటూ కార్యకర్తలు, నాయకుల జంపింగ్‌లు ఎక్కువ అవుతున్నాయి. పార్టీల్లో చేరే వారికి నిత్యం కండువాలు కప్పటమే అభ్యర్థులకు సగం సమయం సరిపోతోంది. ప్రధాన పార్టీలకు చెందిన స్థానిక నాయకులు మెప్పు కోసం రాజకీయంగా క్రియాశీలకంగా లేని అవతలి పార్టీ కార్యకర్తలను సైతం తమ పార్టీ అభ్యర్థులు, నాయకుల వద్దకు తీసుకెళ్లి వారి గురించి గొప్పగా చెబుతూ పార్టీ కండువాలు కప్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న పార్టీని వదిలి హఠాత్తుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తల స్థాయి వారు తమ పార్టీల్లో చేరుతుండడం అభ్యర్థులు అనుమానాలతో బెంబేలెత్తిపోతున్నారు. వీరందరూ కోవర్టులేమోనన్న భయం వెంటాడుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కైకలూరు నియోజకవర్గంలో చేరికలు ఎక్కువగానే జరుగుతున్నాయి.

రండి.. ఓటేసి వెళ్లండి..

రాను పోను ఖర్చులు మావే!



రండి బాబూ రండి.. ఒక్క రోజు వచ్చి ఓటేసి వెళ్లండి.. ప్లీజ్ అంటూ వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానిక ఓటర్లకు కబుర్లు పంపుతూ వారిని ప్రసన్నం చేసుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఉద్యోగాలు, ఇతర వృత్తులు, వ్యాపారాల రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు పోలింగ్ రోజు రావాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు అభ్యర్థిస్తున్నారు. గ్రామాల వారీగా జాబితాలు తయారు చేసి వారి ఫోన్ నెంబర్లు సేకరించి ఓటు అభ్యర్థించేందుకు రమ్మని చెప్పడానికి కైకలూరు నియోజకవర్గంలో పార్టీలు ప్రత్యేకంగా ఒక సోషల్ మీడియా ప్రతినిధిని ఏర్పాటు చేసుకున్నారు. వచ్చిఓటేసి వెళ్లేందుకు అయ్యే ఖర్చును కూడ భరిస్తామంటూ పదే పదే ఫోన్ల మోత మోగిస్తున్నారు. అవసరమైతే హైదరాబాద్, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల్లో రమ్మంటున్నారు.

ఖరీదైన హారతి..



ప్రచారానికి వచ్చే అభ్యర్థులు, ఇతర నాయకులకు మహిళలు హారతులిచ్చి దీవించడం పల్లెల్లో ఓ ఆనవాయితీ. హారతులు చాలా ఖరీదే.. ఓట్లు అభ్యర్థించటానికి ఇంటికి వచ్చినప్పుడు సంబంధిత పార్టీ స్థానిక నాయకుడు వారి ఇంటి వద్ద మహిళలతో బొట్టు పెట్టి హారతులిస్తుంటారు. హారతి పళ్లెంలో అభ్యర్థులు రూ.500 వేస్తున్నారు. దీంతో అభ్యర్థులు రూ.500 నోట్లు జేబుల్లో పెట్టుకునే ప్రచారానికి వెళ్తున్నారు.

- ముదినేపల్లి

సత్తా చాటిన స్వతంత్రులు



పార్టీలతో సబంధం లేదు.. ప్రజల వెన్నంటి సమస్యలపై పోరాడే వాడే నాయకుడు. సమస్యలపై స్పందించే వారిని ప్రజలు నమ్మితే అందలం ఎక్కిస్తారు. ఏ పార్టీ వారు కాకపోయినా స్వతంత్ర అభ్యర్థులైనా ప్రజలు పట్టం కడతారు. దశాబ్దకాలం కిందట జిల్లాలో ఈ తరహా రాజకీయం నడిచేది.. నాడు పార్టీలున్నా.. అభ్యర్థులదే పైచేయి. ప్రస్తుతం రాజకీయాలు మారిపోయాయి. ఈనాటి రాజకీయ పరిస్థితులు చూస్తే పార్టీ బ్యానరే కీలక పాత్ర పోషిస్తుంది. పార్టీ టికెట్ తెచ్చుకునే బరిలో నిలబడి పోరాడి విజయం సాధించాల్సిన అవసరం ఉంది. రెండు దశాబ్దాల వెనక్కు వెళితే జిల్లాలో చాలామంది రాజకీయ పార్టీల అభ్యర్థులతో పోటీపడి స్వతంత్రులుగా విజయం సాధించారు. జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంటు స్థానం ప్రాతిపదికగా జిల్లాలను విభజించక ముందు 16 నియోజకవర్గాలు ఉండేవి. అప్పటి ఉమ్మడి జిల్లాలో 16 నియోజకవర్గాలుగా ఉన్న సమయంలో స్వతంత్రులు ఎన్నికల్లో గెలుపొందారు. భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, ఆచంట, అత్తిలి, ఉంగుటూరు నియోజకవర్గాల్లో స్వతంత్రులు గెలవలేదు.

- కొవ్వూరు నియోజకవర్గం 1952లో ఏర్పడింది. తొలిసారిగా 1967లో కె.బుచ్చిరాయుడు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఆయనకు 34,556 ఓట్లు లభించగా సమీప కాంగ్రెస్ అభ్యర్థి అల్లూరి బాపినీడు 30,168 ఓట్లు పొందారు. మళ్లీ 1972లో బుచ్చిరాయుడే కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగగా స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేసిన ఎ.హనుమంతురావు గెలుపొందారు. విజేతకు 32,228 ఓట్లు రాగా ఓడిపోయిన అభ్యర్థికి 30616 ఓట్లు లభించాయి.
- పెనుగొండలో 1999లో కూనపరెడ్డి వీరరాఘవేంద్రరావు స్వతంత్ర అభ్యర్థిగా విజయంసాధించారు. ఆయనకు 35,838 ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థి పితాని సత్యనారాయణకు 29,221 ఓట్లు లభించాయి.
- ఉండి నియోజకవర్గంలో భార్యాభర్తలు స్వతంత్ర అభ్యర్థులుగా గెలవడం విశేషం. 1967లో కట్రెడ్డి కుసుమేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా 31659 ఓట్లు లభించాయి. ప్రత్యర్థి గోకరాజు రంగరాజు కాంగ్రెస్ తరఫున పోటీ చేసి 27,662 ఓట్లు పొందారు. 1970లో ఉప ఎన్నిక జరిగింది. కుసుమేశ్వరరావు సతీమణి అండాళ్ళమ్మ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి 43749 ఓట్లు లభించగా గెలిచారు.
- తణుకు నియోజకవర్గంలో 1967లో గన్నమని సత్యనారాయణమూర్తి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు.ఆయనకు 36157 ఓట్లు లభించగా ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్(కాంగ్రెస్)కు 29,276 ఓట్లు లభించాయి.
- తాడేపల్లిగూడెంలో 1972లో ఈలి అంజనేయులు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 36,604 ఓట్లు లభించగా ప్రత్యర్థి కె కోసూరి కాంగ్రెస్ తరఫున పోటీ చేయగా 32,404 ఓట్లు లభించాయి.
- దెందులూరు నియోజకవర్గంలో 1962లో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.రామ్మోహనరావు పోటీ చేసి గెలిచారు. ఆయనకు 25,162 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి జి.చినకనకయ్యకు 24,116 ఓట్లు లభించాయి.
- ఏలూరు నియోజకవర్గంలో 1972లో ఎ శ్రీరాములు పోటీ చేయగా ఆయనకు 26,685 ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థి ఎం వెంకట నారాయణకు 18880 ఓట్లు లభించాయి.
- గోపాలపురం (ఎస్సీ) నియోజకవర్గంలో 1972లో ఎస్.వెంకటరావు స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. ఆయనకు 25,859 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి రాఘవులకు 24,531 ఓట్లు లభించాయి.
- చింతలపూడి నియోజకవర్గంలో రెండు సార్లు స్వతంత్రులు విజయం సాధించారు.1972లో డి.కోనేశ్వరరావు బరిలో నిలబడి 35,495 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి ఐ.దానయ్యకు 30520 ఓట్లు లభించాయి. అలాగే 1983లో ఎన్టీయార్ హవాను తట్టుకుని కోటగిరి విద్యాధరరావు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆయనకు 30,329 ఓట్లు లభించాయి. టీడీపీ అభ్యర్థి కెఎల్ఎన్ రాజుకు 23142 ఓట్లు లభించాయి.

చేతినిండా పని..!

- మైక్‌సెట్, ప్రచార సామగ్రికి గిరాకీ
- వంటవారు, కేటరింగ్‌కు డిమాండ్
- ఎన్నికల వేళ తాత్కాలిక ఉపాధి



సాధారణ ఎన్నికలు గ్రామాల్లో సాధారణ వ్యాపారులు, పనివారికి చేతినిండా పని చెప్పాయి. ఎన్నికల వేళ సుమారు నెల రోజుల పాటు ఉపాధికి ఢోకా లేదు. పట్టణాలు, గ్రామాల్లో సైతం ప్రచార బేనర్లు, ప్రింటింగ్ ప్రెస్‌లతో పాటు వాటిని కట్టే పని వారిని రాజకీయ నాయకులు వెతికి పట్టుకుంటున్నారు. ప్రచార రథాలు నడిపే డ్రైవర్లు వంట మాస్టర్లు, కేటరింగ్, హోటల్స్, అల్పాహారం సరఫరా చేసే వారు ప్రతీ ఒక్కరి చేతి నిండా పనే. ప్రస్తుతం ఈ వ్యాపారం మూడు ఆర్డర్లు, ఆరు అడ్వాన్సులుగా విరాజిల్లుతోంది. సుమారు నెల రోజుల పాటు ఈ వ్యాపారాలకు ఢోకా లేదన్న ఉత్సాహంతో ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు ప్రచారంపై ప్రధాన దృష్టి సారించారు. ప్రచార సరంజామా సమకూర్చుకునే పనిలో ఉన్నారు. నామినేషన్ల ఘట్టం సోమవారం ముగుస్తుంది. వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థిత్వాలను ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించనుంది. దీనితో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు విడతల వారీగా అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారం ముమ్మరం చేశారు. టిక్కెట్లు దక్కించుకున్నవారు ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకున్నారు. వారంతా ఎన్నికల సామగ్రి తయారీదారులను ఆశ్రయించడంతో వారికి మంచి గిరాకి ఏర్పడింది. టిక్కెట్లు లభించిన వారి నుంచి ముందస్తుగానే ఆర్డర్లు బుక్కయ్యాయి. టెంట్లు, వంటపాత్రలు, కుర్చీలు, మైక్ సెట్లు, స్పీకర్లు, లైటింగ్ అందుబాటులో ఉంచుకున్నారు. ఎన్నికలు ముగిసే వరకు ఇబ్బంది లేకుండా అన్ని పార్టీల వారు అడ్వాన్సులు కూడా ఇచ్చేస్తున్నారు. వాహనాలు కూడా అద్దెకు తెచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రచారానికి రెండు వారాల సమయం కూడా లేకపోవడంతో ప్రచార రథాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు ఆకర్షణీయమైన ప్రచార రథాలు సిద్ధం చేసుకున్నారు.

పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆహారం సిద్ధం చేసేందుకు వంట పనివారు, కేటరింగ్ సిబ్బందికి ఒక్కసారిగా గిరాకీ ఏర్పడింది. ప్రచారంలో ఫొటోలు, వీడియోగ్రాఫర్లకు మంచి డిమాండ్ వచ్చింది. ఎన్నికలు పూర్తయ్యేవరకు ఫొటోగ్రాఫర్లకు రూ.15వేల నుంచి 25 వేలు, వీడియోగ్రాఫర్లకు రూ.30 వేల నుంచి 40 వేలు ఆదాయం వస్తోంది. కరపత్రాలు, ఫ్లెక్సీల తయారీ జోరందుకుందిఇ. ప్రచారాల్లో పాల్గొనే నాయకులకు అభ్యర్థులకు స్వాగతం చెప్పేందుకు పూలదండలు, పుష్పగుచ్ఛాలు కొనుగోలు చేస్తున్నారు.

- ఏలూరు కల్చరల్, గణపవరం

సిరా గుర్తు 72 గంటలు..



పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ముందు ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్కను గుర్తుగా పెడతారు. దీంతో ఓటరు మరోసారి ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఈ నిబంధన రూపొందించింది. ఓటరు వేలిపై సిరా గుర్తు 72 గంటల పాటు చెరగకుండా ఉంటుంది. మైసూర్‌కు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిస్ పరిశ్రమ తయారుచేసి ఇంకును 1962 నుంచి ఉపయోగిస్తున్నారు. సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల తొందరగా చెరిగిపోదని చెబుతున్నారు.

పోలింగ్ ఆలస్యమైతే..



ఏ కారణాలతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైన్లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రి అయినాసరే వారంతా ఓటు వేసే వరకూ పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రంలో కాని కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో కాని అభ్యర్థి మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తు వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయకూడదు. గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్ళడానికి అభ్యర్థి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒక వేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన వద్ద ఉన్న ఆయుధాన్ని పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తీసుకోవాలి. ఓటు వేసేటప్పుడు ఫోటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

ఏజెంట్లే కీలకం..



పోలింగ్ రోజు అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడికష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని అభ్యర్థుల తరఫున ఏజెంట్లు నిశితంగా పరిశీలించడం, ఏజెంట్ల పని గుర్తింపు పొందిన రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తరఫున ప్రాధాన్యతా క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలిస్తారు. ఏమాత్రం అనుమానం వచ్చినా ఏజెంటు అభ్యంతరాన్ని ప్రెసైడింగ్ అధికారికి తెలుపవచ్చు. ఏజెంట్లుగా అభ్యర్థులు తమకు నమ్మకమైన వారిని కూర్చోపెడతారు. ఏజెంటు తప్పు చేసినా ఆ అభ్యర్థికి నష్టం కలుగుతుంది. - అత్తిలి



గణపవరంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్

నేడు పవన్ కల్యాణ్ పర్యటన

గణపవరం/ కొయ్యలగూడెం ఏప్రిల్ 29: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం గణపవరంలో, 30న కొయ్యలగూడెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29 తేదీ సోమవారం సాయంత్రం గణపవరం మూడు రోడ్ల కూడలిలో సభ నిర్వహిస్తున్నారు. సభ ఏర్పాట్లను జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చరణాల మాలతీరాణి పరిశీలించారు. గణపవరం మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. పిఠాపురం నుంచి హెలికాప్టర్‌పై బయలుదేరి 5 గంటలకు హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి వారాహి వాహనంపై బొబ్బిలి వంతెన మీదుగా సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారు. ఎండల్లో పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రేపు కొయ్యలగూడెంలో..

30వ తేదీన కొయ్యలగూడెంలో పర్యటించనున్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పవన్ మాట్లాడనున్నారు. మండలంలోని గవరవరం సాయిరాకేష్ పాఠశాల వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడకు చేరుకున్న పవన్‌కల్యాణ్ గవరవరం నుంచి కొయ్యలగూడెం సెంటర్ వరకు ర్యాలీగా వస్తారు. హెలిప్యాడ్ పనులను, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను సోమవారం పార్టీ నాయకులు పరిశీలించారు. మెట్ట ప్రాంతంలో మొట్టమొదటిగా పవన్ పర్యటన జరగనున్నందున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

నేడు షర్మిల పర్యటన

కొయ్యలగూడెం, ఏప్రిల్ 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం కొయ్యలగూడెంలో పర్యటిస్తారని మండల కాంగ్రెస్ నాయకుడు దారం సత్తిరాజు తెలిపారు. కొయ్యలగూడెం కన్నాపురం రోడ్డులో సాయంత్రం రోడ్‌షో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.



మాధవాయిపాలెంలో చెక్‌పోస్టు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకురాలు ఎం.దీప

ముమ్మరంగా తనిఖీలు చేయాలి

నరసాపురం, ఏప్రిల్ 28; జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్ని క్షుణంగా తనికీ చేయాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ ఎం.దీప ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని మాధవాయిపాలెం రేవులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, వైఎన్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను అర్డీవో అంబరీష్‌తో కలసి పరిశీలించారు అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లుపై సమీక్షించారు. ఎన్నికల సంఘం నింబంధనల ప్రకారం సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టులలో తరుచూ తనికీ చేస్తుండాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ నాగదేవి ఉన్నారు.

నియోజకవర్గం జాతీయ రహదారికి అనుకుని ఉండడంతో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతూ తళుకులీనుతున్నది. గోదావరి జలాలు అందుబాటులో ఉండడం వల్ల పంటలకు పుష్కలంగా నీరు అందుతుంది. రైతుల వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నారు. తణుకు పారిశ్రామిక పట్టణంగా మన్ననలు అందుకుంటోంది. వాణిజ్య రంగంలో బెల్లం మార్కెట్‌కు పెట్టింది పేరు. ఎందరో రాజకీయ ఉద్ధండులు ఇక్కడనుంచే ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తణుకులో అత్యధిక పర్యాయాలు ఆ పార్టీనే విజయం సాధించింది బోళ్ల బుల్లిరామయ్య ఏలూరు పార్లమెంట్ స్థానానికి ఎన్నికయ్యారు. ఆయన కేంద్రంలో వాణిజ్య సహాయ మంత్రిగా వ్యవహరించారు. తణుకు పట్టణానికి వన్నెతెచ్చారు. పారిశ్రామికంగా ఎంత ప్రాముఖ్యత ఉందో రాజకీయంగానూ తణుకు పట్టణానికి అంతే ప్రాధాన్యం ఉంది. ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెసు 6, తెలుగుదేశం 6, వైసీపీ 1, ఇండిపెండెంట్ 1, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ ఒకసారి గెలుపొందాయి. - తణుకు





పరిశ్రమలకు చిరునామా

నియోజకవర్గంలో కాపు, తెలగ, బలిజ 19.37 శాతం ఓటర్లు ఉండగా శెట్టిబలిజ, గౌడ 14.23, మాల 11.85, కమ్మ 11.37 బ్రాహ్మణ 5.54, రెడ్డి 5.50, మాదిగ 4.48, క్షత్రియ 4.33, వైశ్య 3.16 ,రజక 3, పద్మ శాలి 1.78, యాదవ 1.63, నాయి బ్రాహ్మణ 1.14, ముస్లిం 1, మత్సకార 0.98 శాతం ఉండగా ఉప్పర, క్రిస్టియన్, కుమ్మరి, ఎరుకులు, కొప్పుల వెలమ, యానాదులు, మార్వాడీస్, ముదిరాజ్, విశ్వబ్రాహ్మణ, పెరిక, వెలమ 6.69 శాతం ఉన్నారు.

ఫ్లాష్ బ్యాక్

పారిశ్రామిక ప్రగతితో అభివృద్ధి
రాజకీయంగా చైతన్యం
స్వాతంత్ర్య సమరయోధులకు పుట్టినిల్లు



నియోజకవర్గం : తణుకు
పార్లమెంటు నియోజకవర్గం : నరసాపురం
మండలాలు : తణుకు, అత్తిలి, ఇరగవరం
మొత్తం ఓటర్లు : 2,34,575
పురుషులు : 1,14,435
మహిళలు : 1,20,135
ఇతరులు : 5

తణుకు నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది ప్రముఖులు ప్రాతినిధ్యం వహించారు. తణుకు రాజకీయ చరిత్రలో ముగ్గురు వ్యక్తులే కీలకంగా వ్యవహరించారు. అత్యధిక సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తణుకు పట్టణ అభివృద్ధికి కృషి చేశారు. పారిశ్రామిక వేత్త ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ రెండుసార్లు, గన్నమన్ని సత్యనారాయణ మూర్తి రెండు పర్యాయాలు, ముళ్లపూడి వెంకటకృష్ణారావు మూడు దఫాలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత అత్యధిక సార్లు ఆ పార్టీ తణుకులో పాగా వేసింది. తెలుగుదేశం స్థాపించిన తర్వాత 1983 నుంచి ఇప్పటి దాకా తెలుగుదేశం అభ్యర్థులు ఆరుసార్లు సార్లు గెలుపొందారు. 1983 నుంచి 1999 వరకు 16 సంవత్సరాల పాటు తెలుగుదేశం పార్టీకి ఎదురు లేకుండా పోయింది. అన్ని ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు విజయ బావుటా ఎగురవేశారు. 2004లో మాత్రం కాంగ్రెస్ తరపున చిట్టూరి బాపినీడు ఎన్నికయ్యారు. 2009లో కారుమూరి కాంగ్రెస్ నుంచి ఎన్ని కయ్యారు. ఆ తర్వాత 2014లో తెలుగుదేశం తరపున ఆరిమిల్లి విజయం సాధించారు. 2019లో కారుమూరి వైసీపీ నుంచి గెలుపొందారు.

మారిన స్వరూపం

తణుకు నియోజకవర్గంలో తొలుత, ఉండ్రాజవరం మండలంతో పాటు, తాడే పల్లిగూడెం రూరల్ మండలం నుంచి కృష్ణాయ పాలెం, పెంటపాడు మండలంలో 10 గ్రామాలు ఉండేవి. 2008లో జిల్లాల పునర్విభజన తర్వాత తణుకు నుంచి ఉండ్రాజవరం మండలం విడిపోయి నిడదవోలులో కలిసింది. పెంటపాడు, తాడేపల్లిగూడెం మండల గ్రామాలు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విలీనమయ్యాయి. తణుకులో ఇరగవరం, అత్తిలి మండలాలు కలిశాయి.

పారిశ్రామిక ప్రగతి

తణుకు పట్టణానికి జిల్లాలోనే ప్రత్యేకత ఉంది. రాజకీయంగానే కాకుండా పారి శ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం. ఆంద్రా సుగర్స్ ఫ్యాక్టరీలో రాకెట్ ఇంధనం తయారీ ద్వారా ప్రపంచ పటంలో తణుకు పట్టణానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తణుకు పరిసరాల్లో సుమారు 15 నుంచి 20 భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఆయిల్స్ ఫ్యాక్టరీలతో పాటు టెక్స్‌టైల్స్, హెయిర్ ఇండస్ట్రీస్, స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. వీటి ద్వారా కొన్ని వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ వరి, చెరకు పంటలను రైతులు పండించేవారు. రాను రాను చెరకులో ఆధునిక యంత్రాలు లేకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల విస్తీర్ణం తగ్గిస్తూ వచ్చారు. వరి పంటకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

తణుకు వైద్యపరంగా పురోగతిలో ఉంది. పూర్వ పశ్చిమగోదావరిలో జిల్లా ఆసుపత్రిని తణుకులో ఏర్పాటు చేశారు. ఏరియా ఆసుపత్రిగా ఉన్న తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఇప్పుడు జిల్లా ఆసుపత్రిగా పదోన్నతి పొందింది. వైద్య సదుపాయాలు మెరుగయ్యాయి. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు కూడా తణుకులో అభివృద్ధి చెందాయి. జిల్లా నుంచి అనేకమంది వైద్యం కోసం తణుకు వస్తుంటారు.

ఆధ్యాత్మికతను పంచే ఆలయాలు

పట్టణంలో ప్రసిద్ధిమైన ఆలయాలు ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్నాయి. సజ్జాపురంలోని గోస్తనీ ఒడ్డున ఉన్నశివాలయం ప్రశిద్ధి గాంచింది. నిత్య పుష్కరిణి అయిన గోస్తనీకి ఆనుకుని ఉన్న ఈ దేవాలయం ఎంతో మహిమాన్వితమైనదని భక్తులు నమ్మకం. పాతూరులో శివాలయం చాలా పురాతనమైది. శ్రీరాముడు రావణ వధ అనంతరం బ్రహ్మహత్య పాప పరిహారారం గోస్తనీ నది ఒడ్డున విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక్కడ ఉన్న సూర్యదేవాలయం జిల్లాలోనే రెండవదిగా చెబుతుంటారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1952	చిట్టూరి ఇంద్రయ్య	కెంబీపీ	చిట్టూరి సుబ్బారావు చైదరి	కాంగ్రెస్	6,313
1955	ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్	కాంగ్రెస్	చిట్టూరి సుబ్బారావు చౌదరి	సీపీఐ	6,862
1962	ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్	కాంగ్రెస్	చిట్టూరి ఇంద్రయ్య	ఇండిపెండెంట్	119
1967	గన్నమని సత్యనారాయణమూర్తి	ఇండిపెండెంట్	ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్	కాంగ్రెస్	6,889
1972	గన్నమని సత్యనారాయణమూర్తి	కాంగ్రెస్	చిట్టూరి సుబ్బారావు చౌదరి	కాంగ్రెస్-ఐ	20,000
1978	కంటిపూడి అప్పారావు	కాంగ్రెస్	గన్నమని సత్యనారాయణమూర్తి	కాంగ్రెస్-ఐ	14,062
1983	చిట్టూరి వెంకటేశ్వరరావు	టీడీపీ	గన్నమని సత్యనారాయణమూర్తి	ఇండిపెండెంట్	4,098
1985	ముళ్ళపూడి వెంకట కృష్ణారావు	టీడీపీ	కరుటూరి అనంతరామమూర్తి	కాంగ్రెస్	31,899
1989	ముళ్ళపూడి వెంకట కృష్ణారావు	టీడీపీ	చిట్టూరి బాపినీడు	కాంగ్రెస్	9,381
1994	ముళ్ళపూడి వెంకట కృష్ణారావు	టీడీపీ	చిట్టూరి అచ్యుతరామ ప్రసాద్	కాంగ్రెస్	22,456
1999	వైటీ రాజా	టీడీపీ	బూరుగుపల్లి చిన్నారావు	కాంగ్రెస్	23,847
2004	చిట్టూరి బాపినీడు	కాంగ్రెస్	వైటీ రాజా	టీడీపీ	5,377
2009	కారుమూరి నాగేశ్వరరావు	కాంగ్రెస్	వైటీ రాజా	టీడీపీ	1,451
2014	ఆరిమిల్లి రాధాకృష్ణ	టీడీపీ	చీర్ల రాధయ్య	వైసీపీ	30,948
2019	కారుమూరి నాగేశ్వరావు	వైసీపీ	ఆరిమిల్లి రాధాకృష్ణ	టీడీపీ	2,195

విద్యారంగంలో అభివృద్ధి అంతంతే

పారిశ్రామిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం ఉన్న తణుకులో విద్యా వ్యవస్థ మాత్రం అంతగా అభివృద్ధి కాలేదనే చెప్పాలి. ప్రభుత్వ విద్యా సంస్థలు తక్కువగా ఉన్నాయి. ఇటీవలే పాఠశాల స్థాయిలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు స్థాపించారు. ఇప్పుడిప్పుడే విద్యా రంగంలోనూ ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది.

స్వాతంత్ర్య సమరయోధులకు పుట్టినిల్లు

స్వాతంత్ర్య ఉద్యమంలో తణుకు పట్టణం నుంచి అనేకమంది పాల్గొన్నారు.అనేక సందర్భాలలో జైలు జీవితం అనుభవించారు.తల్లాప్రగడ నాగరాజు, వాడపల్లి సుబ్బన్నశాస్త్రి, యర్రమిల్లి వెంకటేశ్వర్లు, చొప్పెల సుబ్బారావు, రంగావఝుల రామచంద్రరావు, సబ్బి అప్పలస్వామి, కొవ్వలి గోపాలరావు, ముదిగంటి జగ్గన్నశాస్త్రి, రంగావఝుల సత్యనారాయణ, కె.లక్ష్మీపతి, సత్తిరాజు మంగమ్మ, యర్రమిల్లి నరసింహరావు, గొట్టుముక్కల రామచంద్రరాజు, కాత్రాలపల్లి సుబ్బారావు, పోతరాజు సుబ్బయ్య, చల్లా అప్పారావు, చిట్టూరి ఇంద్రయ్య తదితరులు స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా జైలు జీవితం అనుభవించారు.

ఇదీ సంగతి !

ఇక్కడ..మండల ఓటర్లే కీలకం



జిల్లాలో అతి చిన్న నియోజకవర్గం నరసాపురం. ఈ నియోజకవర్గంలో పట్టణంతో పాటు నరసాపురం, మొగల్తూరు మండలాలు ఉండగా మొత్తం ఓటర్లు 1,68,187. ఇందులో పురుషులు 83,745, మహిళలు 84,442 మంది ఉన్నారు. అయితే ఇక్కడ గెలవాలంటే పట్టణ ఓటర్ల కన్నా నరసాపురం మండల ఓటర్లే కీలకం. పట్టణంలో ఓటర్లు 46,480 మంది ఉండగా, మొగల్తూరు మండలంలో 58,728 మంది ఉన్నారు. ఇక కీలకమైన నరసాపురం మండలంలో 62,979 మంది ఉన్నారు. ఈ మండలంలో మొత్తం 28 గ్రామాలు ఉన్నాయి. వీటిలో మూడు మేజర్ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ గెలుపు ఓటమిలను నిర్దేశించే ఓటర్లు ఈ మూడు పంచాయతీల్లోనే ఉన్నారు. దీంతో పార్టీలన్నీ ఈ మండలంపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఈ మండలంలో మెజార్టీ సాధిస్తే గెలుపు సునాయాసమని అంచనా వేస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. ఈసారి కూడా ఈ మండలంలో పట్టు సాధించాలని బరిలో ఉన్న ఇద్దరు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఎవరికి మెజార్టీ వస్తుందో వేచిచూడాలి.

\- నరసాపురం

సెంటిమెంట్

ఖాకీ దుస్తులతో ప్రచారం



ఎన్నికల్లో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి కొత్త ప్రయోగాలు చేస్తుంటారు. కొన్ని సెంటిమెంట్లను పాటిస్తుంటారు. దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అలాంటి సెంటిమెంట్‌ను ఫాలో అవుతూ వస్తున్నారు. 2009 నుంచి 2019 వరకు ఖాకీ దుస్తులు ధరించే ఆయన ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. ఇప్పుడు కూడా అదే స్టైల్‌లో ప్రచారం చేస్తున్నారు. నందమూరి తారక రామారావు ఖాకీ దుస్తులతో తన తొలి రాజకీయ ప్రచారం ప్రారంభించి సక్సెస్ అయ్యారని ఖాకీ కష్టజీవి చిహ్నమని అందుకే ఇలా ప్రచారం చేస్తున్నట్టు ఆయన చెబుతున్నారు. అంతేకాక 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో ప్రచారానికి వచ్చిన జూనియర్ ఎన్టీఆర్ కూడా ఖాకీ దుస్తుల్లో వచ్చి దెందులూరు నియోజకవర్గంలో ప్రచారం చేశారు.

\- పెదవేగి

రియల్..ఢమాల్



మందగించిన రిజిస్ట్రేషన్లు
స్థిరాస్తుల క్రయ,విక్రయాలపై ఎన్నికల ప్రభావం
మరో నాలుగు నెలులు ఇంతే

పాలకొల్లు, ఏప్రిల్ 28 : అసలే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత మందగించింది. ఎన్నికల ఖర్చులకై ప్రధాన పార్టీల అభ్యర్థులు వందల కోట్ల రూపాయలు సమీకరించుకుని నిల్వ చేయడంతో ఆ ప్రభావం స్థిరాస్తుల క్రయ విక్రయాలపై పడింది. నెల రోజులుగా రిజిస్ట్రేషన్లు తగ్గి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు వెలవెల బోతున్నాయి. అప్పులు తీసుకునే వారి మార్టుగేజ్ రిజిస్ట్రేషన్లు, టైటిల్ డీడ్ రిజిస్ట్రేషన్లు మినహా కొనుగోళ్లు గణనీయంగా పడిపోయాయి. ఎన్నికల అనంతరం నాలుగైదు నెలల పాటు రియల్ ఎస్టేట్ రంగానికి గడ్డు కాలమేనని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు సమీకరించిన అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఈ మొత్తాలను ఓటర్లుకు పంపిణీ చేయనున్నారు. వందల కోట్ల రూపాయలు ప్రజల చేతుల్లోకి వేలు రూపాయలుగా మార్పు చెంది రావడంతో ఆ చిన్న మొత్తాలు విపణిలో కొనుగోళ్లకే వెళతాయి కానీ, స్థిరాస్తుల కొనుగోళ్లకు వచ్చే పరిస్థితి లేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా చెదిరిపోయిన వేల కోట్ల రూపాయలు మరలా పెద్ద మొత్తాలుగా మారి రియల్ ఎస్టేట్ రంగానికి రావాలంటే 5, 6 నెలలు సమయం పడుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు జిల్లాలోని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే నిధుల సమీకరణలో ఉన్నారు. స్థిరాస్తులపై రుణాలు, విరాళాలు, దగ్గర వారి వద్ద నుంచి అప్పులు తీసుకుని సమీకరించుకుంటున్నారు. వైసీపీ అభ్యర్థులు అయితే జిల్లాలోని ఆయా నియోజక వర్గాలను బట్టి ఓటుకు రూ.2 నుంచి రూ. 5 వేల వరకు, టీడీపీ అభ్యర్థులు రూ. వెయ్యి నుంచి రూ.2 వేలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. పెద్ద నోట్ల రద్దు, నవ్యాంధ్రలో అస్తవ్యస్త పాలన, అనంతరం ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు మొత్తంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని పతనం చేశాయి. 2023 ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకూ పాలకొల్లు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 598 రిజిస్ట్రేషన్లు కాగా, ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 26వ తేదీ నాటికి 562 రిజిస్ట్రేషన్లు మాత్రమే అయ్యాయి. అయితే ఇందులో 50 శాతం పైబడి బ్యాంక్ మార్టు గేజ్‌లు, ప్రైవేటు తనఖాలు, నేరుగా టైటిల్ డీడ్‌పై అప్పులే ఉంటాయని చెబుతున్నారు.



వచ్చేస్తున్నాం..ఓట్ల పండక్కి..

నరసాపురం, ఏప్రిల్ 28: ఐదేళ్లకు ఒకసారి వచ్చే పండుగ ఎన్నికలు..భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి ఓటర్ ఆసక్తి చూపుతాడు. పండుగలకు వచ్చినా రాకపోయినా... ఓటు వేసేందుకు మాత్రం కచ్చితంగా స్వగ్రామాలకు వస్తుంటారు. చాలామంది ఉద్యోగాల రీత్యా ఇతర రాష్ట్రాల్లో ఉన్నప్పటికీ తమ ఓటును మాత్రం స్వగ్రామంలోనే ఉంచుకున్నారు. కొవిడ్ కారణంగా రెండేళ్ల పాటు స్థానికంగా ఉన్న చాలామంది తమ ఓటు రద్దు కాకుండా చూసుకున్నారు. దీంతో వీరంతా ఓటు వేసేందుకు రెడీ అవుతున్నారు. ఊళ్లకు వచ్చేందుకు ఇప్పటికే రైళ్లకు అడ్వాన్స్‌గా రిజర్వేషన్ చేయించుకున్నారు. మరికొందరు వాహనాల్లో వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

రైళ్లలో దొరకని టిక్కెట్లు

అంతా రైళ్లకే రిజర్వేషన్లు చేయించుకోవడంతో జిల్లా మీదుగా నడిచే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిండుకున్నాయి. ప్రధానంగా హైద్రాబాద్ నుంచి వచ్చే ఓటర్లు ఎక్కువగా ఉండటంతో వచ్చే 10,11 తేదీల్లో జిల్లా మీదుగా నడిచే నరసాపూర్, గౌతమి, గోదావరి వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌ల్లో వెయిటింగ్ లిస్టు 500 దాటి నో రూమ్ చూపిస్తున్నది. తిరుగు ప్రయాణంలో 13,14 తేదీల్లో ఇదే పరిస్థితి ఉంది. ఏసీ కోచ్‌ల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో టిక్కెట్లు దొరకని మరింత కొంత మంది ప్రత్యేక రైళ్ళ కోసం ఎదురు చూస్తున్నారు.

- రిజర్వేషన్ పరిస్థితికి కొస్తే నరసాపురం ఎక్స్‌ప్రెస్‌లో 10న స్లీపర్ క్లాస్‌లో 395, 11న నో రూమ్, 12న 302 వెయిటింగ్ లిస్టు ఉంది, ఇక ఏసీ త్రీటైర్‌లో 10, 11 తేదీల్లో నో రూమ్ చూపిస్తున్నది. 12న 105 వెయింటిగ్ లిస్టు ఉంది. తిరుగు ప్రయాణంలో 13 వ తేదీన నో రూమ్, 14న 306 స్లీపర్ క్లాస్ ఉంది. ఈ రెండు తేదీల్లో ఏసీ నో..రూమ్ చూపిస్తున్నది.
- గోదావరి ఎక్స్‌ప్రెస్ స్లీపర్‌లో 10న 260, 11న 307, 12న 215 వెయిటింగ్ లిస్టు ఉంది. ఏసీలో 10న 148, 11న 135, 12న 214 వెయిటింగ్ లిస్టు ఉంది. తిరుగు ప్రయాణంలో 13న స్లీపర్‌లో నో రూమ్, 14న , 15 తేదిల్లో వెయిటింగ్‌లిస్టు 300, 190 ఉంది.
- గౌతమిలో 10, 11 తేదిల్లో నో రూమ్ చూపిస్తున్నది. 12న 430 వెయిటింగ్ లిస్టు ఉంది. ఏసీ విషయానికి వస్తే 10న 150, 11న 136, 12న 90 ఉంది, ఇక తిరుగు ప్రయాణంలో 13న స్లీపర్‌లో వెయిటింగ్ లిస్టు 326, 14న 246, 15న 157 ఉంది. ఏసీలో వెయిటింగ్‌లిస్టు ఈ మూడు రోజుల్లో 100 పైబడే ఉంది. ఇదే పరిస్థితి సికింద్రాబాద్ నుంచి నరసాపురం వరకు నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్, భీమవరం, తణుకు మీదుగా నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు కూడా కనిపిస్తుంది.

విస్తృతంగా తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రూ.7,360 విలువైన 23.9 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో రూ.70 వేలు నగదు సీజ్ చేసినట్టు తెలిపారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా బృందాలు దాడులు నిర్వహించాయి. అదనపు ఎస్పీ స్వయంగా పాల్గొని అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లాలో నాటుసారా, మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. శుక్రవారం చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఇబి పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు.4,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 216 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 9 కేసులు నమోదు చేసి 35.61 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కల్గి ఉన్న వారిపై ఇద్దరుపై కేసులు నమోదు చేసి 11.9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 15 మంది వ్యక్తులను, ఒక మోటారు సైకిల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు.

సువిధలో 2,162 అభ్యర్థనలు పరిష్కారం

ఏలూరుసిటీ : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు జిల్లావ్యాప్తంగా మొత్తం రూ. 13.96 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం,ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు.ప్రచార అనుమతుల అందిన అభ్యర్థనలకు ఇంతవరకు 2,162 అనుమతులు ఇచ్చాన్నారు.



బెల్లపుఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

వైసీపీ డకవుట్‌కు ప్రజలు సిద్ధం

» ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి


ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలతో బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 28: వైసీపీ అరాచక పాలనను ప్రజలే డకవుట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. ఆదివారం కట్టా సుబ్బారావు తోటలో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే ప్రజల కష్టాలన్ని తొలగిపోతాయన్నారు. జగన్ రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. జగన్ ప్రకటించిన మేనిఫెస్టో పాత చింతకాయ పచ్చడిలా ఉందన్నారు. సాయంత్రం మీసాల అప్పన్నస్వామి గుడి వద్ద నుంచి ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. బ్రాహ్మణ్య సాధికార సమితి జిల్లా కన్వీనర్ ఎంబీఎస్ శర్మ, కడియాల విజయలక్ష్మి, రెడ్డి అప్పలనాయుడు, మధ్యాహ్నపు ఈశ్వరి బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

● మన్నాచర్చి మినిస్ట్రీస్ బిషప్ ఎం.ఎలీషారావు కూటమి అభ్యర్థి బడేటి చంటిని రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఆదివారం మన్నాచర్చిలో పాస్టర్ ఎం.జ్యోతిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, కొట్టు మనోజ్, జుంజు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు విశేష స్పందన

» టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు


గణపవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న గన్ని, పత్సమట్ల

గణపవరం, ఏప్రిల్ 28: కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని వైసీపీ ఓటమి ఖాయమని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఆదివారం గణపవరం, పిప్పరలో జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలన అంతం చేయాలన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వైసీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో దగా మేనిఫెస్టో అని విమర్శించారు. ధర్మరాజు మాట్లాడుతూ ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు చూపిస్తామని స్పష్టం చేశారు. పిప్పరలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మరాజు వాకపల్లి గ్రామానికి చెందిన 20 మందికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, దాట్ల సుబ్బరాజు, రంగరాజు, భీమవరపు ఏసురాజు, గణపవరం టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమారరాజు, టీడీపీ యువత అధ్యక్షుడు కాపారం చిన్న, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, పల్లి వెంకటేశ్వరరావు, సప్పా రాంబాబు, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, కొలనువాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో భారత్ బచావో బృందం పర్యటన

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 28. బీజేపీ నియంతృత్వపాలన ఎదుర్కోవాలంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ వామపక్షపార్టీల అభ్యర్థులను గెలిపించాలని భారత్ బచావో రాష్ట్ర వైస్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి,పెరియార్ అంబేద్కర్ పూలే రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మస్తాన్, జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంకు చేరుకున్న భారత్ బచావో బృందం నాయకులతో కొద్దిసేపు చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు, ఏలూరు ఇండియా కూటమి అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.కిషోర్, కాంగ్రెస్ నేతలు మురళీకృష్ణ, డి.చంద్రశేఖర్ పలు పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభం

చింతలపూడి, ఏప్రిల్ 28 : చింతలపూడి నియోజకవర్గంలో ఓటర్లకు స్లిప్పుల పంపిణీ ప్రారంభించినట్టు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, లింగపాలెం మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆయా బూత్ కన్వీనర్ల ద్వారా ఇంటింటికి వెళ్ళి స్లిప్పులను అందించడం ప్రారంభించారు. మే నాలుగో తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. నాటుసారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. పలు పట్టణాల్లోని ఏటీఎంలు, మసీదులను గస్తీ పోలీసులు పరిశీలన చేశారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు.

వీరమ్మకుంటలో గడ్డివాము దగ్ధం



పెదపాడు, ఏప్రిల్ 28 : వీరమ్మకుంట గ్రామంలో కలిపిండి అప్పారావుకు చెందిన సుమారు 25 ఎకరాల గడ్డివాము శనివారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురైంది. అగ్ని ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఏలూరు ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీరికి స్థానికులు సహకారం అందించారు. ప్రమాదంలో గడ్డివాము పక్కనే కట్టి వున్న మూడు గేదెలు మంటల వేడికి తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదంలో సుమారు రూ.2.5 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


పేరంటాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

దెందులూరు,ఏప్రిల్ 28 : సంతాన లక్ష్మిగా పేరొందిన గాలాయగూడెం పూజారి వారి ఆడపడుచు గ్రామదేవత నాగస్విని పేరంటాలమ్మ ఉత్సవాలను ఆదివారం వైభవంగా ఉత్సవ నిర్వాహకులు ప్రారంభించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పూజారి ఆడపడుచు కావడంతో పసుపు ,కుంకుమ, పుట్టింటి నూతన వస్త్రాలను పూజారి అన్నవరం దుర్గ, పూజారి శ్రీనివాస రావు, కనకదుర్గ అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏనుగు రామకృష్ణ, పెద్దిశెట్టి నాని, ఘంట సుబ్బారావు, పూజారి రాంబాబు తదితరులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి ఏప్రిల్ 28 : రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గాశేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. కొవిడ్ నిబంధనలు అనుసరించి, అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించామని, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

సివిల్ ఇంజనీర్‌గా..

» పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తా
» ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ హామీ


కుక్కునూరు మండలంలో ఎంపీ అభ్యర్థి పుట్టా, ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి

కుక్కునూరు/వేలేరుపాడు, ఏప్రిల్ 28 : సివిల్ ఇంజనీర్‌గా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వేగవంతమయ్యేలా కృషి చేస్తూ నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో అన్నివిధాలా న్యాయం చేస్తానని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ నిర్వాసితులకు హామీ ఇచ్చారు. ఆదివారం పోలవరం అసెంబ్లీ అభ్యర్థి చిర్రి బాలరాజుతో కలసి కుక్కునూరు మండలంలో దాదాపు 40 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహిస్తూ నిర్వాసితులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. వందలాది వాహనాలతో వేలాదిగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ రోడ్‌షోకు అనూహ్యమైన స్పందన లభించింది. కూటమి అభ్యర్థులను గ్రామాల్లోకి ఆహ్వానిస్తూ గిరిజన కళాకారులు డప్పు కళాకారులు నృత్యం, విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎంపీ అభ్యర్థి పుట్టా తనదైన శైలిలో నిర్వాసిత సమస్యలపై పదేపదే మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం టీడీపీ హయాంలో 75 శాతం పూర్తిచేయగా జగన్ ప్రభుత్వం కనీసం రెండు శాతం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. పోలవరం ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నిర్వాసితుల కోసం ఏమాత్రం పనిచేయలేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● కూటమి అభ్యర్థులైన చిర్రి బాలరాజు, పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ వేలేరుపాడు మండలంలో ప్రచారానికి రాగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి రోడ్‌షోను విజయవంతం చేశారు. వేలేరుపాడు మండలం వసంతవాడ నుంచి రుద్రమకోట, రేపాకగొమ్ము గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

కూటమి విజయం తథ్యం

» టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు


గణపవరంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు


గోపన్నపాలెం ప్రచారంలో ఇస్త్రీ చేస్తున్న చింతమనేని

గణపవరం, ఏప్రిల్ 28: రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమని భావితరాల భవిష్యత్తు కోసం ఆలోచించే ఎన్‌డీఏ కూటమితో కలిసి ముందుకు సాగుతున్నామని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఆదివారం రాత్రి గణపవరంలో జనసేన కూటమి ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు మద్దతుగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాం జనేయులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జగన్ మేనిఫెస్టో అంతా మోసమన్నారు. మన పిల్లల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం : చింతమనేని

దెందులూరు/పెదవేగి, ఏప్రిల్ 28 : వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదివారం దెందులూరు మండలంలోని సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని ఆర్‌టీసీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గోపన్నపాలెంలో మాజీ ఎంపీటీసీ భవాని ప్రసాద్ షాపు వద్ద దుస్తులను చింతమనేని ఇస్త్రీ చేశారు. దళిత సంఘం జిల్లా నేత దాసే శ్రీను, మెడిద రిత్వి, వరుకుటి సుందరం మాట్లాడుతూ టీడీపీ కూటమికి దళిత వర్గాలను దూరం చేసేందుకు కొంత మంది కుట్ర పన్ని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. పెదవేగి మండలంలో పినకడిమికి చెందిన కడమంచి గోపరాజుతోపాటు వైసీపీ నేతలు భారీగా టీడీపీలో చేరాయి.

కొయ్యలగూడెంలో ఇంటింటా ప్రచారం..

కొయ్యలగూడెం, ఏప్రిల్ 28: కూటమి సభ్యులైన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించాలంటూ కొయ్యలగూడెం పట్టణంలో ఇంటింటా ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే ప్రజలకు అందించే పథకాలు వివరించారు. రామాలయం సెంటర్ వద్ద ఇంటింటా ప్రచారం సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి

లింగపాలెం, ఏప్రిల్ 28 : టీడీపీ హయాంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, గత ఎన్నికల్లో వైసీపీకి ఒక చాన్స్ ఇవ్వాలని రాష్ట్రప్రజలు వేసిన ఒక తప్పటడుగు వల్ల ఏపీ భవిష్యత్‌ను మార్చేసిందని, రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిందని చింతలపూడి నియోజకవర్గ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆదివారం మటంగూడెంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఘంటా సాయికృష్ణతో పాటు 150 కుటుంబాలతో టీడీపీలో చేశారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

రుద్రమకోటలో తేనెటీగల దాడి.. కార్యకర్తలకు గాయాలు

వేలేరుపాడు, ఏప్రిల్ 28 : కూటమి ఉమ్మడి అభ్యర్థుల ప్రచారం నిమిత్తం రుద్రమకోట గ్రామానికి వెళ్తుండగా రోడ్డుపక్కన చెట్లపై ఉన్న తేనె టీగల తుట్టెలను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కదిలించడంతో అదే సమయంలో ప్రచారానికి వస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, చిర్రి బాలరాజు తదితరులతో పాటుకార్యకర్తలపై తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ నేపథ్యంలో రుద్రమకోట గ్రామంలో అర్ధంతంగా రోడ్డు షో కార్యక్రమాన్ని విరమించాల్సి వచ్చింది.

పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విక్రాంత్

గణపవరం, ఏప్రిల్ 28: డెల్టా ప్రాంతంలో నీటి కాలుష్యం ఫలితంగా అనేక మందికి లివర్ వ్యాధులకు గురవుతున్నారని భీమవరానికి చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ విక్రాంత్ తెలిపారు. ఆదివారం గణపవరంలోని లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు పీఎంపీల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. డాక్టర్ విక్రాంత్ మాట్లాడుతూ నీటికాలుష్యం, మద్యపానం, ధూమపానం తదితర చెడు అలవాట్ల నుంచి ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు. హెప టైటిస్ ఏ, బీ, సీ వ్యాధులకు అనేక మంది గురుతున్నారన్నారు. గ్యాస్‌కు సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రముఖ వైద్య నిపుణులు మల్లేశ్వరి, సాయిబాబా, ప్రియాంక అవగాహన కల్పించారు. రాష్ట్ర పీఎంపీల సంఘం గౌరవ అధ్యక్షుడు జయసూర్య, జిల్లా పీఎంపీల సంఘం అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, నిడమర్రు పీఎంపీల సంఘం అధ్యక్షుడు మూర్తి పాల్గొన్నారు.

నటుడు అరవింద్‌కు ఉగాది పురస్కారం


నటుడు అరవింద్‌కు ఉగాది పురస్కారం అందజేస్తున్న ప్రతినిధులు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 28: ఇటీవల జయరామన్, చందన, అరవింద్, ప్రజ్ఞాగౌతమ్, సుమన్ ముఖ్య తారాగణంగా బొమ్మిడి ప్రసాదరాజు దర్శకత్వంలో అనన్య చిత్రం విడుదలై ప్రేక్షకులను అలరించింది. హర్రర్ నేపథ్యంలో కుటుంబ ప్రేమకథా చిత్రంగా ఈ చిత్రం రూపొందించారు. ఈ చిత్రంలో విలన్‌గా నటించిన ఏలూరుకు చెందిన జాలా అరవింద్‌కు హైదరాబాద్‌కు చెందిన గోల్డెన్ ఫ్యూచర్ గ్లోబల్‌సేవా ఫౌండేషన్, మోరాట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సినిమా తెలుగు ట్రైడ్ అవార్డ్స్ పేరుతో ఉగాది పురస్కారాలను ప్రదానం చేసింది. ఈ క్రమంలో అనన్య చిత్రంలో విలన్‌గా నటించిన అరవింద్‌కు ఉగాది పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ అనన్య సినిమాలో నటన ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మంచి పాత్రలను పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటానని ఆయన పేర్కొన్నారు.

క్రైం వార్తలు

వేర్వేరు చోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో వేర్వేరు చోట్ల ఆదివారం మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఏలూరు జిల్లాలో నలుగురు మృతి చెందగా.. తూర్పుగోదావరి జిల్లాలోని రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయ

టిప్పర్ లారీ ఢీకొని రిటైర్డ్ ఎస్ఐ మృతి


జగ్గూర్ బాషా (ఫైల్)

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 : టిప్పర్ లారీ ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో ఆ మోటారు సైకిల్ వెనుక కూర్చున్న రిటైర్డ్ ఎస్ఐ అక్కడికక్కడే మృతి చెందారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం లక్ష్మీ జగ్గూర్‌బాషా (80) పోలీస్ శాఖలో ఎస్ఐగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన మనుమడు షేక్ రెహమాన్ మోటారు సైకిల్‌పై ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఏలూరు కండ్రికగూడెం సెంటర్ నుంచి అశోక్‌నగర్ వెళ్లే మార్గంలోని పెట్రోల్ బంక్ వద్ద టిప్పర్‌లారీ అతి వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న జగ్గూర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాధిక్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. టిప్పర్‌లారీని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.


కాపవరం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

» ఆరుగురికి స్వల్పగాయాలు.. కాపవరం వద్ద లారీని ఢీకొన్న వ్యాన్

కాపవరం వద్ద లారీని వ్యాన్ ఢీకొనడంతో ఘటన

కొవ్వూరు, ఏప్రిల్ 28: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరు శనివారపుపేటకు చెందిన సౌండ్ సిస్టమ్ ఆపరేటర్స్ తారా డేవిడ్ మరో ఏడుగురు కలిసి శనివారం రాత్రి ఏలూరు నుంచి గుంటూరు వెళ్లి సౌండ్ సిస్టమ్స్ లోడ్‌చేసుకుని చోడవరం బయలుదేరారు. మార్గమధ్యలో కొవ్వూరు మండలం కాపవరం హైవేపై గోవర్ధనగిరిమెట్ట ఫ్లైఓవర్ సమీపానికి చేరుకునే సరికి జగ్గయ్యపేట నుంచి సిమెంటు లోడ్‌తో ఒడిశా వెళ్తున్న లారీ రోడ్డు మార్జిన్‌లో ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా నిలుపుదల చేశాడు. అదే సమయంలో గుంటూరు నుంచి విశాఖపట్నం చోడవరం వెళ్తున్న ఐషర్ వ్యాన్ కంట్రోల్ చేయలేక ఆగివున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఏలూరుకు చెందిన మేడం వినోద్‌కుమార్(32), దారబోయిన ప్రభాకర్(21)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ కె.సుధాకర్, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, రాత్రి గస్తీ నిర్వహిస్తున్న దిశ డీఎస్పీ, రోడ్డు భద్రతా మొబైల్ సిబ్బంది, ఎన్‌హెచ్ 16 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. తారా డేవిడ్ అందించిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.

ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మస్తాన్‌మన్యం కాలనీలో నివాసం ఉంటున్న షేక్ మదీనా (41) భార్య మున్నీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్న మదీనా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నారు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ కె. రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐ దానం తన సిబ్బందితో సంఘటనా స్థలానానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించనున్నారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 28 : రైలు పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు టీడీ కాలనీకి చెందిన కాకినాడ సతీష్ (41) ఏలూరు రామకృష్ణాపురం వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ఆదివారం ఉదయం రైలు ఢీ కొంది. అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

లింగపాలెం, ఏప్రిల్ 28: లింగపాలెం మండలం తువ్వచిలుక రాయుడు పాలెం గ్రామంలో పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పొదిల అనిల్(29) అనే వ్యక్తి కుటుంబకలహాల నేపథ్యంలో ఈనెల14వ తేదీన పురుగుల మందు తాగినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే ధర్మాజీగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు.

నాటు సారా స్వాధీనం.. ఒకరి అరెస్ట్

లింగపాలెం, ఏప్రిల్ 28: ములగలంపాడుగ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా సారా నిల్వచేసినట్లు సమాచారంతో పోలీసులు దాడిచేసి సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా నిల్వచేసిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వైఎంహెచ్ఏ ప్రాంగణంలో సినీగీతాలను ఆలపిస్తున్న గాయకులు

అలరించిన సినీ సంగీత లహరి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 28:ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి, ఎస్‌పీఎస్ మ్యూజిక్ స్టూడియో ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్ఏ ప్రాంగణంలో పాడుతా తీయగా గ్రాండ్ కన్సర్ట్ కార్యక్రమం అలరించింది. ఈ సందర్భంగా పలువురు వర్ధమాన గాయనీగాయకులు ఆలపించిన సినీ సంగీత కార్యక్రమం ఉర్రూత లూగించింది. ఈ కార్యక్రమానికి పాడుతా తీయగా విజేత రసూల్‌బాబు, సరిగమ ఫేమ్ సుధారాణి, చెన్నైకి చెందిన వయోలిన్ విద్వాంసులు బాలాజి విచ్చేశారు. ఇటీవల పాడుతాతీయగా పేరుతో సినీసంగీతంలో వర్ధమాన కళాకారులను ప్రోత్సహించేందుకు గ్రాండ్ కాన్సెప్ట్ నిర్వహించినట్టు ప్రముఖ సినీదర్శకుడు ఎస్‌పీ వాసు తెలిపారు. ఈ సందర్భంగా గాయకులు అర్జున్‌రావు, వైప్రసాద్, విజయ్, ప్రత్యూష జెయిన్, హర్షిత, కోటేశ్వరి, అనూష, సుకన్య పలు సినీగీతాలను ఆలపించారు.

జేఈఈ ర్యాంకర్ మూగ విద్యార్థినికి

టీడీపీ నేతల అభినందనలు


రావికంపాడులో విద్యార్థిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కామవరపుకోట, ఏప్రిల్ 27 : రావికంపాడు గ్రామానికి చెందిన మూగ విద్యార్థి పి.పూర్ణసంహిత జేఈఈ మెయిన్స్‌లో దేశవ్యాప్తంగా 257వ ర్యాంకు సాధించింది. దీంతో ఆ విద్యార్థిని గ్రామసర్పంచ్ వేముల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మాన్యం దుర్గారావు, యర్రావుల దుర్గారావు, డోలా విజయ్, దుర్గాప్రసాద్, శాంతిరాజు, జగన్నాధం దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. మూగ విద్యార్థిని అయినప్పటికి పట్టుదలతో జంగారెడ్డిగూడెంలోని వేంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలో శిక్షణ పొంది మంచిర్యాంకు సాధించడం గ్రామానికే గర్వకారణమని సర్పంచ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భగవద్గీత నిత్యపారాయణ గ్రంథం


ప్రసంగిస్తున్న హరిశ్రీనివాసశాస్త్రి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 28 : భగవద్గీత నిత్యపారాయణ గ్రంథమని భారతీయ, సంస్కృతి, సంప్రదా యం వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త హరిశ్రీనివాసశాస్త్రి అన్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ ఆధ్వర్యంలో ఆదివారం వైఎంహెచ్ఏ ప్రాంగణంలో భగవద్గీత పారాయణంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత నిత్యపారా యణంతో ఆధ్యాత్మిక జీవన విధానం మెరుగు అవుతుందన్నారు. యర్రా శివరామకృష్ణ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, డాక్టర్ వై.లక్ష్మీకామేశ్వరి, వరప్రసాదరావు, నుదురుపాటి కృష్ణచైతన్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం అందరి బాధ్యత

ఉంగుటూరు, ఏప్రిల్ 28 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బాధ్యత ప్రతి ఒక్కరిదని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం నారాయణపురంలో మానవత మండల సమావేశం మండలాధ్యక్షుడు గంజి రవి అధ్యక్షతన జరిగింది. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, నరసింహరాజు, గుణ్ణం బుల్లెబ్బాయి, బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

మే డేను పండుగలా జరుపుకోవాలి

లింగపాలెం, ఏప్రిల్ 28: ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలనే నినాదంతో మేడేను కార్మికులంతా పండుగలా జరుపుకోవాలని ఏఐటీయూసీ ఏలూరుజిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు అన్నారు. రంగాపురం గ్రామంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను సాధించుకున్న మేడేని ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ముఠా వర్కర్స్ అధ్యక్షుడు మాదాసు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డోలా సత్యబాబు, మానేపల్లి బాలకృష్ణ, కాట్రు శ్రీకాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

లింగపాలెం, ఏప్రిల్ 28: ధర్మాజీగూడెంశాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి సీహెచ్ వి.రమణ అన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు చదువుతో పాటు అనేక విజ్ఞాన విషయాలను తెలుపుతామని వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో విద్యార్థులు పాఠ్యాంశాలపై అవగాహన కలిగేలా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీ నేత కిలారుకు పలువురి పరామర్శ

కామవరపుకోట,ఏప్రిల్ 28. అనారోగ్యానికి గురైన కామవరపుకోట మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ ఈ ఏడాది జనవరి 31న హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం వెళ్లి తిరిగి ఆరోగ్యంతో ఆదివారం కామవరపుకోటకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకటసుబ్బారావు, చింతలపూడి బీసీ నియోజకర్గ అధ్యక్షుడు జుజ్జూరి బాబ్జి కిలారు ను పరామర్శించించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డోలా విజయ్, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, బోడా అనీష్, కటికర్ల నాని, పెనుమాల కిరణ్, తొంటా రాంబాబు, కొమ్మిన నవీన్‌కృష్ణ, యలమర్తి రాంబాబు, వానపల్లి పండు, బొల్లిబోయిన కళ్యాణ్, నెక్కలపు గంగాధరరావు, మల్లెల్లి పృథ్వీ, బొప్పన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో ఉన్నతమైన జీవితం


పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఏప్రిల్ 28 : గ్రంథపఠనం జీవితాన్ని మరింత ఉన్నతంగా మార్చుతుందని పెదవేగి శాఖ గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగిలో శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ గ్రంథపఠనంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. నిత్యం గ్రంథపఠనం చేస్తే వారి భవిష్యత్ అభివృద్ధి బాట పడుతుందని, ఉన్నతమైన జీవితం గడిపే వీలుంటుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉజ్వలంగా నడిపిస్తుందని తెలిపారు.


గణపవరంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్

నేడు పవన్ కల్యాణ్ పర్యటన

గణపవరం/ కొయ్యలగూడెం ఏప్రిల్ 29: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం గణపవరంలో 30న కొయ్యలగూడెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29 తేదీ సోమవారం సాయంత్రం గణపవరం మూడు రోడ్ల కూడలిలో సభ నిర్వహిస్తు న్నారు. సభ ఏర్పాట్లను జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చరణాల మాలతీరాణి పరిశీలించారు. గణప వరం మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. పిఠాపురం నుంచి హెలికాప్టర్‌పై బయలుదేరి 5 గంటలకు హెలిప్యాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి వారాహి వాహనంపై బొబ్బిలి వంతెన మీదుగా సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారు. ఎండల్లో పార్టీశ్రేణులకు, అభిమా నులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రేపు కొయ్యలగూడెంలో..

30వ తేదీన కొయ్యలగూడెంలో పర్యటించ నున్నట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పవన్ మాట్లాడనున్నారు. మండలంలోని గవర వరం సాయిరాకేష్ పాఠశాల వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడకు చేరుకున్న పవన్‌కల్యాణ్ గవర వరం నుంచి కొయ్యలగూడెం సెంటర్ వరకు ర్యాలీగా వస్తారు. హెలిప్యాడ్ పనులను వాహనాల పార్కింగ్ ప్రాంతాలను సోమవారం పార్టీ నాయకులు పరిశీ లిం చారు. మెట్ట ప్రాంతంలో మొట్టమొదటిగా పవన్ పర్యటన జరగనున్నందున భారీగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

నేడు షర్మిల పర్యటన

కొయ్యలగూడెం, ఏప్రిల్ 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం పర్యటిస్తారని మండల కాంగ్రెస్ నాయకుడు దారం సత్తిరాజు తెలిపారు. కొయ్యల గూడెం కన్నాపురం రోడ్డులో సాయంత్రం రోడ్‌షో నిర్వహిం చను న్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఈ పర్యటనను విజయ వంతం చేయాలని కోరారు.


రైలింగ్ విరిగి ప్రమాదకరంగా వంతెన

రైలింగ్ విరిగి.. కూలేందుకు సిద్ధంగా..

▸ప్రమాదకరంగా పోతుమర్రు వంతెన ▸పట్టించుకోని అధికారులు ▸ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు

కలిదిండి, ఏప్రిల్ 28: మండలంలోని పోతుమర్రు వద్ద పెదకొమ్ములేరు డ్రెయిన్‌పై గల వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. వంతెనకిరు వైపులా రైలింగ్ విరిగిపోయింది. వంతెన గోడలు బీటలు వారాయి. ఏ క్షణంలో కూలిపోతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ వంతెనపై నుంచి కొండూరు, తాడినాడ, చిన తాడినాడ, పోతుమర్రు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన సమీపంలో జడ్పీ హైస్కూల్ ఉండటంతో ఆయా గ్రామాల విద్యార్థులు కూడా ఈ వంతెన పై నుంచి సైకిళ్లపై వెళ్లి వస్తుంటారు. వంతెన రైలింగ్ విరిగిపోవటంతో వాహన చోదకులతో పాటు విద్యార్థులు అదుపు తప్పి డ్రెయిన్‌లో పడి గాయపడ్డారు. వంతెనకు మరమ్మతులు చేసి రైలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు పెద కొమ్ములేరు పొంగటంతో ఈ వంతెనపైకి నీరు చేరుతుం డటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గుర్వాయిపాలెంలో కైకలూరు కూటమి అభ్యర్థి కామినేని ప్రచారం


కామినేని సమక్షంలో కూటమిలో చేరిన వైసీపీ శ్రేణులు

రైతుల సంక్షేమమే లక్ష్యం : కామినేని

కలిదిండి, ఏప్రిల్ 28 : రైతుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కలిదిండి మండలం గుర్వాయిపాలెం, అమరావతి, సంతోషపురం, భాస్కర రావు పేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ చేపలు, రొయ్యలతో పాటు ధాన్యానికి గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు రాక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. వైసీపీ పాలనలో ఆక్వా రంగం నిర్వీర్యమైందన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో నగదు చెల్లించకపోవటం దారుణమ న్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉన్నా పాలకులు పట్టించు కోవటం లేదన్నారు. రహదారులు గుంతలతో దారుణంగా ఉన్నాయని, ఎవరైనా మరమ్మతులు చేసినా, ప్రశ్నించినా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సాగు నీటి కొరత నివారణకు రూ.13 కోట్లతో కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలన్నారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆక్వా రంగాన్ని లాభాల బాటలో నడిపించి చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేస్తానని, అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు. కూటమి అభ్యర్థినైన తనకు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి మరో షాక్.. కూటమిలో భారీ చేరికలు

కలిదిండి మండలంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. ఆదివారం కలిదిండితో పాటు గుర్వాయిపాలెం, పడమటిపాలెం, కొండంగి, పల్లిపాలెం గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 600 మంది కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ సమక్షంలో కూటమిలో చేరారు. వీరికి కామినేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కామినేని తనయుడి ప్రచారం

కైకలూరు: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు ఈ ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని కైకలూరు కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కొడాలి వినోద్ అన్నారు. ఆదివారం కైకలూరు దానగూడెంలో కామినేని తనయుడు వేణుగోపాల్‌తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే కైకలూరు గ్రీన్ విలేజ్‌లో, శ్యామలాంబపురంలో టీడీపీ నాయకులు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ పాలనలో విద్యావంతులైన యువత ఉద్యోగాలు లేక ఉపాధి పనులకు వెళ్లడం బాధాకరమన్నారు. ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం కోమర్రు, చినకోమర్రు గ్రామాల్లో ఆదివారం కైకలూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తరఫున ఆయన తనయుడు వేణుగోపాల్ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని ఇంటింటా ఓటర్లను అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి రాజారావు, మోటేపల్లి హనుమ తదితరులు పాల్గొన్నారు.

40 కేసుల నమోదు : ఆర్డీవో



నూజివీడు టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి నూజివీడు పరిధిలో మొత్తం 40 కేసులను నమోదుచేసినట్లు నూజివీడు రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి తెలిపారు. 325 లీటర్ల సారాను స్వాధీన పరుచుకుని 9,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 187 లీటర్ల అనధికారిక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మార్చి 16 నుంచి ఆదివారం వరకు 16 ఐడీ కేసులు, 24 ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేశామని, 36 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 187 లీటర్ల అనధికార మద్యం, 327 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించి నూజివీడు ఎస్‌ఈబీ సీఐ నివేదిక అందించారని ఆమె తెలిపారు.


ముదినేపల్లి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నిఘా

ముదినేపల్లి, ఏప్రిల్ 28 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఏర్పాటైన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద నిఘా ఏర్పాటు చేశాయి. ఈ దుకాణాల నుంచి పరిమితికి మించి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి రవాణా చేస్తుంటే పట్టుకునేందుకు నిఘా వేశారు. ముదినేపల్లి మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలతోపాటు పూర్వపు బెల్టు షాపుల నిర్వాహకులపై కూడా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దృష్టి సారించారు. మండల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, డ్రైనేజీ ఏఈలు భోగేంద్ర ప్రసాద్, కుమార్ ఇతర సిబ్బంది రాత్రుళ్లు మద్యం విక్రయాలపై మరింత నిఘా పెంచారు. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు జీపీఎస్ చేయటమే కాక, ఆ వాహనాలకు కూడా రెండు రోజుల క్రితం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా వాహనం వెళ్లే పరిసరాల్లో ఏం జరుగుతున్నదీ ఏలూరులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఎప్పటికప్పుడు తెలుస్తుంది. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉండే అవకాశం లేదు.

ఎన్నికల స్పెషల్

ప్రచారం.. గీత దాటొద్దు



నామినేషన్ల ప్రక్రియ దాదాపు ముగియడంతో ప్రచారం తారస్థాయికి చేరుకుంది. అభ్యర్థులు, వారి తరఫున నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపిస్తుంది. ప్రచారం హద్దు మీరకుండా గీత గీసింది.

- ప్రచార వాహనానికి రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పొందిన వారే ఆ వాహనాన్ని వాడాలి.
- విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా ఉండాలి.
- ప్రచారంలో కార్యకర్తలకు ఇచ్చే టోపీలు, కండువాల ఖర్చులో ఎన్నికల వ్యయంలో చూపించాలి.
- ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల ఎన్నికల ఆఫీసులు ఉండకూడదు.
- రాత్రి పది గంటల తర్వాత ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- వాహనాలపై మతపరమైన ఫొటోలు ఉండకూడదు.

\- ముదినేపల్లి

అమ్మో.. ఫోన్ కాల్



ఎన్నికల ప్రచారంతో చేతిలో ఫోన్‌తో చికాకే. మాటి మాటికి రాజకీయ నేతలు, పోటీలో ఉన్న అభ్యర్థుల ఫోన్ కాల్స్, రికార్డెడ్ వాయిస్‌తో విసిగిస్తున్నారు. ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థుల ప్రచారం కూడా తోడైంది. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు సెల్ ఫోన్లలో వాయిస్ కాల్స్ ద్వారా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నేను ఫలానా పార్టీ అభ్యర్థిని, నా ఎన్నికల గుర్తు ఫలానా అని చెబుతున్నారు. మీకు అందుబాటులో ఉండి సేవలందిస్తా- మీ ఓటు వేసి నన్ను గెలిపించండి అంటూ ఫోన్లలో మోత మోగిస్తున్నారు. వాట్సాప్ మెస్సేజ్‌లు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మెస్సేజ్‌లతో కూడా ప్రచారం చేస్తున్నారు. ఫోన్ వాయిస్ కాల్స్ ఎక్కువగా వస్తున్నాయి.

\- ముదినేపల్లి

ఓటేశారా.. ఇలా చూసుకోండి



పోలింగ్ రోజున ఈవీఎంలో మనం ఏ అభ్యర్థికి ఓటు వేశామో వెంటనే చూసుకోవచ్చు. మనకు నచ్చిన అభ్యర్థికి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది. ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్) ద్వారా ఈ అవకాశాన్ని కల్పించారు. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకండ్ల సమయం వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాట్ బాక్స్‌లో పడిపోతుంది. బ్యాలెట్ యూనిట్‌లో ఓటు వేయగానే మనం వేసిన ఓటు పేపర్‌పై ప్రింట్ అవుతుంది. దానికి అనుసంధానంగా వీవీప్యాట్‌లో ఆ పేపర్ మనకు కనిపిస్తుంది. - ముదినేపల్లి


కొలుసు సమక్షంలో టీడీపీలో చేరిన సగర కుటుంబాలు

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు : పార్థసారథి

ముసునూరు, ఏప్రిల్ 28: టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని, ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసేలా ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి కోరారు. ఆదివారం కాట్రేని పాడు, హరిశ్చంద్రపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక, దోపిడీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. నియోజకవర్గంలో దొర పాలనలో అభివృద్ధి శూన్యమని, ఎన్నికల్లో తనను గెలిపిస్తే నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, ఎంపీటీసీ నాగమంజుల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు శ్యామలరావు, గ్రామ అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు 32వ వార్డులో కూటమి అభ్యర్థి పార్థసారథి విజయం కోరుతూ ఆయన సతీమణి కమల లక్ష్మి ప్రచారం నిర్వహించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గొల్లు దుర్గాదేవి, కొంపెల్ల కృష్ణకుమారి, పాదం సత్యనారాయణ, కందిపల్లి చెన్నారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

25 సగర కుటుంబాలు టీడీపీలో చేరిక

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని సగర సామాజిక వర్గానికి చెందిన రాణిమేకల గణేష్, మల్లేశ్వరరావు, భాను, కలవకొల్లు ప్రసాద్, గండికోట రామస్వామి, జలసూత్రం తిరుమలరావు తదితర 25 కుటుంబాలు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరాయి. చంద్రబాబు పథకాలు ఎంతో లబ్ధి చేకూర్చుతాయన్నారు.

అలరించిన సినీ సంగీత లహరి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 28:ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి, ఎస్‌పీఎస్ మ్యూజిక్ స్టూడియో ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక వైఎం హెచ్ఏ ప్రాంగణంలో పాడుతా తీయగా గ్రాండ్ కన్సర్ట్ కార్యక్రమం అలరిం చింది. ఈ సందర్భంగా పలువురు వర్ధమాన గాయనీగాయకులు ఆలపించిన సినీ సంగీత కార్యక్రమం ఉర్రూత లూగించింది.


సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ వీరమల్లు నరసింహారావు

కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి

కైకలూరు, ఏప్రిల్ 28: ఎన్నికల్లో అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు టీడీపీ కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని కైకలూరు నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ఆదివారం కైకలూరులో క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ కన్వీనర్‌గా తనను చంద్రబాబునాయుడు ఎంపిక చేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అందరిని కలుపు కొని అఖండ మెజార్టీతో పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, కో-కన్వీనర్లు కొడాలి వినోద్, తేరా రమేష్, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని నాగేశ్వరరావు, తెలుగు మహి ళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, రాష్ట్ర రైతు సంఘ నాయకుడు చలసాని జగన్మోహనరావు, ఎస్సీ సెల్ నాయకుడు పళ్లెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం కోసం..



ముసునూరు, ఏప్రిల్ 27: ఓటు హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా అనే నినాదంతో అధికార యంత్రాంగం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. కలెక్టర్, ఆర్వో జారీ చేసిన ఈ ఫ్లెక్సీల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఆమోదించిన గుర్తింపు పత్రాల వివరాలు, కంట్రోల్ రూమ్ నంబర్లు, పోలింగ్ తేదీ ముద్రించి ఉన్నాయి. దారిన వెళ్ళేవారు ఫ్లెక్సీల వద్ద ఆగి చదివి వెళుతున్నారు.



సబ్ స్టేషన్లలో భారీ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

పగటిపూట వ్యవసాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

చాట్రాయి, ఏప్రిల్ 28: మండలంలో రైతులకు పగటి పూట వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సబ్ స్టేషన్లలో భారీ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతున్నారు. ఇప్పటి వరకు సబ్ స్టేషన్లలో తక్కువ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటం, ఒక ఫీడరుకు పగలు, మరో ఫీడర్‌కు రాత్రి వంతుల వారీగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రైతులు రాత్రి సమయాల్లో పొలాల్లోకి వెళ్ళి పంటలకు నీరందించటం ప్రమాదకరంగా మారింది. రైతులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించి సబ్ స్టేషన్లలో భారీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాట్రాయి, కోటపాడు, జనార్దనవరం సబ్ స్టేషన్లలో రూ 3.75 కోట్లతో 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, వ్యవసాయానికి పగలు విద్యుత్ సరఫరా ప్రారంభించామని, త్వరలో పోలవరం, తుమ్మగూడెం, చనుబండ సబ్ స్టేషన్లలో కూడా భారీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

క్రైం వార్తలు

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

చాట్రాయి, ఏప్రిల్ 28: మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన బర్రె ఆమని (30) అనే మహిళ, ఆమె ఇద్దరు పిల్లల అదృశ్యంపై చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భార్యాభర్తల గొడవల కారణంగా 3 రోజుల నుంచి కనిపించకుండా పోవటంతో పుట్టింటి వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం భార్యా భర్తల మధ్య గొడవ జరగటంతో భర్తపై ఫిర్యాదు చేసేందుకు ఆమని తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈ నెల 25వ తేదీన చాట్రాయి పోలీస్‌స్టేషన్‌కు రాగా పోలీసులంతా ఎన్నికల బందోబస్తుకు వెళ్ళటంతో స్టేషన్‌లో ఎవరూ లేకపోవటంతో ఆమె అక్కడ నుంచి వెనుదిరిగింది. అయితే ఆమె పుట్టింటికి గానీ, అత్తింటికి గానీ వెళ్ళలేదు. ఆందోళన చెందిన పుట్టింటి వారు చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసీహెచ్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార మద్యం స్వాధీనం



నూజివీడు టౌన్, ఏప్రిల్ 28: నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఒకర్ని అదుపులోకి తీసుకుని అతని నుంచి ఆరు మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎస్ఈబీ సీఐ వెంకటరమణ తెలిపారు. చాట్రాయి మండలం పర్వతాపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా సంచరిస్తున్న అతని నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోతనపల్లి చిన్న తండాలో నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. మరో కేసులో మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆయన తెలిపారు.

తెలుసుకుందాం..

ఎ-ఫాం, బీ-ఫాం అంటే..



ఎన్నికల నామినేషన్ ఘట్టం పూర్తయ్యింది. ఎన్నికల సమయంలో ఏ-ఫాం, బీ-ఫాం అనే పదాలు తరచూ వింటూంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫాంలు ఇస్తాయి. ఫలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధృవీకరణ పత్రమే ఇది. ఈ ఫాంను పార్టీ అధ్యక్షుడు కానీ ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి అవసరమైన ధృవపత్రాలతో పాటు బీ-ఫాంను దాఖలు చేయాల్సి ఉంటుంది. బీ-ఫాం సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే అతడిని స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫాంలు అందిస్తారు. ఆ అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫాం. ఇది తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫాం ఇచ్చే అధికారం ఉంటుంది.

-గణపవరం


మూల్లంక రహదారి పక్కనే చెత్త కుప్పలు


నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

దుర్వాసనతో.. రోగుల ఉక్కిరి బిక్కిరి

▸రోడ్ల పక్కనే చెత్తకుప్పలు ▸తడి-పొడి చెత్త తరలింపు ఏదీ?
▸దుర్గంధంతో మూల్లంక పీహెచ్‌సీకి వెళ్లే రోగుల వెతలు
▸నిరుపయోగంగా సంపద కేంద్రాలు
▸ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని స్థానికుల వినతి

కలిదిండి, ఏప్రిల్ 28 : మండలంలో మూల్లంక పీహెచ్‌సీకి కూత వేటు దూరంలో రోడ్డు పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలోని చెత్తాచెదారమంతా ఇక్కడే వేస్తున్నారు. ఆస్పత్రికి వెళ్లే రోగులు చెత్త కుప్పల నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నారు. ప్రధాన రహదారి పక్కనే చెత్త కుప్పలు డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. చెత్త కుప్పలను తగలబెడుతున్నప్పుడు దట్టంగా పొగ కమ్ముకోవటంతో వాహనదారులు కళ్లు మండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కుప్పలున్న ప్రాంతానికి సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ కూడా ఉంది. గ్రామంలోనే చెత్తాచెదారం వేయవద్దని పాలకులు, అధికారులకు పలు మార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం లేదని, దీంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మూల్లంక ప్రధాన రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.